

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 11 సెప్టెంబరు 2024





బయటకెళ్తే.. భయం



వేధింపులు, దాడులు, అత్యాచారాలు, హత్యాచారాలు, హత్యలతో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళలు, విద్యార్థినులు, యువతులు మళ్లీ ఇంటికి వచ్చే వరకు కుటుంబసభ్యులు భయం భయంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో చిన్నచిన్న ఘటనలకే పోలీసులు కఠిన చర్యలు తీసుకునే వారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పోలీసింగ్ అనేది లేకపోవడంతో అరాచకవాదుల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. మద్యానికి తోడు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సులభంగా అందుబాటులోకి రావడం.. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి అకృత్యా లకు పాల్పడటం పరిపాటిగా మారింది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంత తకు నిలయమైన ప్రాంతాల్లో కూడా అనేక దారుణ ఘటన లు వెలుగుచూశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల బాపట్ల జిల్లా చీరాలలో అత్యంత పాశవికంగా జరిగిన యువతి అత్యా చారం హత్య ఘటనతో ఉలిక్కి పడిన ఉమ్మడి గుంటూరు జిల్లా, కోల్‌కతాలో జరిగిన జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనతో మరింత కలవరం చెందింది. మహిళల రక్షణ అంశం చర్చకు వచ్చింది.

- ప్రమాదంలో మహిళా భద్రత
- ఆందోళనకర స్థాయిలో అనేక అకృత్యాలు
- పెరిగిపోతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు
- గంజాయి, మత్తు పదార్థాల ప్రభావంతోనే దారుణాలు

విచ్చల విడిగా గంజాయి వ్యాప్తి

వైసీపీ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి విచ్చలవిడిగా చలామణిలోకి వచ్చింది. మహి ళలపై జరిగిన అఘాయిత్యాల్లో ఏ ఘటన చూసినా నిందితు లు గంజాయి మత్తులో ఉండడం సాధారణ అంశంగా మారిం ది. హైస్కూలు స్థాయి పిల్లలకు కూడా గంజాయి అందు బాటులోకి వచ్చిందంటే గంజాయి వ్యాప్తి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గంజాయి మత్తులో దాడులకు పాల్ప డుతున్నారని వస్తున్న ఫిర్యాదులు ప్రతి రోజూ పదుల సంఖ్యలో వస్తు న్నాయి. కూటమి ప్రభుత్వం ఈ సవాలును స్వీకరిం చి, అరాచక మూకల ఆట కట్టించక పోతే ఆడబిడ్డల భద్రత మరింత ప్రమా దంలో పడే ప్రమాదం లేక పోలేదు.



బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంగా చెప్పుకుంటున్న ఈ కంప్యూటర్ యుగంలో కూడా మహిళకు రక్షణ లేకపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆడబిడ్డ తిరిగి ఇంటికి వచ్చే వరకు కుటుంబసభ్యులు ఆందోళన చెందాల్సిన భయానక వాతావరణం నెలకొంది. మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్య ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన ఐదేళ్లలో లెక్కకు మిక్కిలి మహిళలపై దౌర్జన్యాలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా సామూహిక అత్యాచారాలు, హత్యలు నమోదయ్యాయి. 2022లో ఉమ్మడి జిల్లాలో అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. పల్నాడు జిల్లా గురజాల రైల్వే స్టేషన్ సమీపంలో ఒడిశా మహిళపై గ్యాంగ్ రేప్, దుగ్గిరాల మండలం చిలువూరులో దళిత యువతి గ్యాంగ్‌రేప్, హత్య, బాపట్ల జిల్లా రేపల్లె రైల్వే స్టేషన్‌లో వలస కూలీ కుటుంబంపై దాడి, మహిళ గ్యాంగ్ రేప్ ఘటనలు కేవలం పదిహేను రోజుల వ్యవధిలో వెలుగుచూశాయి. అదే ఏడాది పల్నాడు జిల్లాలో ఆశ వర్కర్‌గా ఉన్న 46 ఏళ్ల గిరిజన మహిళపై ముగ్గురు అత్యాచారం చేశారు. మాజీ సీఎం ఇలాఖా తాడేపల్లిలో అంధ యువతిని గంజాయి మత్తులో దారుణంగా హత్య చేయడం, మరో ఘటనలో యువతిని గ్యాంగ్ రేప్ చేసి పారిపోవడం వంటి అనేక ఘటనలు గత ఐదేళ్లలో పెచ్చరిల్లి పోయాయి.

అడ్డగోలు మద్యం విధానం

గతంలో మద్యం షాపుల వద్దే మందుబాబులకు ఒక రూమ్ ఏర్పాటు చేసేవారు. వారు అక్కడే మద్యం తాగి ఇళ్లకు వెళ్లిపోయేవారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానం కారణంగా మందుబాబులు ఊర్లమీద పడ్డారు. మద్యం షాపుల్లో తాగే అవకాశం లేక పోవడంతో బహిరంగ స్థలాల్లో మద్యపానం సర్వసాధారణంగా మారింది. ఆ సమయంలో అటుగా వెళ్లే మహిళలపై వేధింపులకు పాల్పడడం, ఎదురు తిరిగిన వారిపై దాడి చేయడం మందుబాబులకు పరిపాటిగా మారింది. ఈ ఘటనలపై ఫిర్యాదులు నమోదైనా పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదు.



కొన్ని ఘటనలే.. కేసుల వరకు..

స్త్రీ శిశు సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం గుంటూరు జిల్లాలో గడిచిన ఎనిమిది నెలల్లో గుం టూరు, బాపట్ల, పల్నాడు జిల్లా ల్లో చిన్నారులు, విద్యార్థినులపై వేధింపుల కేసులు 50కి పైగా నమోదయ్యాయి. కిందటేడాది మూడు జిల్లాల్లో బాలికలకు సంబంధించి దాదాపు వంద, మహిళలపై వేధింపుల కేసులు 40 వరకు నమోదయ్యాయి. అయితే వాస్తవంలో వీటికి అనేక రెట్లు మహిళలు, విద్యార్థినులపై దౌర్జన్యాలు జరుగుతున్నాయి. అవి పోలీస్ స్టేషన్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వరకూ రావడం లేదు.

సంగారెడ్డికి చెందిన ఓ నడి వయసు మహిళను ఇటీవల గుంటూరు పోలీసులు గుర్తించి స్త్రీ శిశు సంక్షేమ శాఖకు తీసుకువచ్చారు. వివరాలు సేకరించగా తెలంగాణ నుంచి ఒకరితో కలిసి ఆమె గుంటూరు వచ్చింది. అతడు కొన్ని రోజులు ఆమెతో కలిసి ఉండి, ఆ తర్వాత ఆమెకు చెప్పకుండా వదిలి వెళ్లి పోయాడు. దీంతో రోడ్డు పాలైన ఆమెను ఐసీడీఎస్ అధికారులు చేరదీసి స్వధార్‌లో ఆశ్రయం కల్పించారు.

పెళ్లికి అంగీకరించలేదని తాడేపల్లికి చెందిన ఓ యువతిపై ఓ ప్రేమోన్మాది బ్లేడుతో దాడి చేశాడు. తన ప్రేమను అంగీకరించలేదన్న కసితో ఆమెపై బ్లేడుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.


- బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం గ్రామంలో ఉదయాన్నే బహిర్భూమికి వెళ్లిన ఓ యువతిని కొందరు దుండగులు అత్యాచారం చేసి, అత్యంత కిరాతకంగా హత్య చేశారు.
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చిన కొండ్రుపాడులో 13 ఏళ్ల బాలికపై దుండగులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత హత్య చేశారు.

- పల్నాడు జిల్లా క్రిస్టియన్‌పాలేనికి చెందిన 20 ఏళ్ల దివ్యాంగురాలిపై అదే ప్రాంతానికి చెందిన దళిత యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. రొంపిచర్ల మం డలం నల్లగార్లపాడు గ్రామానికి చెందిన ఓ వివాహితపై లైంగిక దాడి జరిగింది.

- పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం పీర్ల చావడిలో నిద్రపోతున్న మహిళను ఇద్దరు యువకులు హత్య చేశారు.

ఇలా చెప్పుకుంటూ పోతే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, అకృ త్యాలకు అంతూపొతూ లేకుండా పోతుంది. అత్యాచారం అనే మాటే అరుదుగా వినిపించే ఈ ప్రాంతంలో ఇప్పుడు సామూహిక అత్యాచారం అనే పదం పదేపదే వినిపిస్తోంది. సాధారణ కుటుంబాల్లో భయ ప్రకంపనలు సృష్టిస్తోంది. మొత్తం సమాజాన్నే ఆందోళనలోకి నెట్టేస్తోంది.

ఆసరా కోసం.. ఆశగా..



- ముంపు ప్రాంతాల్లో నేడు కేంద్ర బృందం పర్యటన
- ఉదారంగా ఆదుకోవడంపైనే బాధితుల ఆశలు
- దాదాపు రూ.600 కోట్ల మేర వరదార్పణం

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ మహోగ్రరూపానికి వారం రోజుల పాటు లంక గ్రామాలు విలవిలలాడాయి. పంటలు మొదలు ఇళ్ల వరకు వేటినీ వదలకుండా అన్నింటినీ వరదలు మింగేశాయి. ఆసాంతం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుటుంబాలు కొన్నైతే వరదల ధాటికి కోలుకోలేని విధంగా నష్టాన్ని చవిచూసిన వారు మరికొందరు. కొన్ని ప్రాంతాల్లో పంటలు ఇప్పటికీ నీటిలోనే తేలియాడుతూ అన్నదాతకు గుండెకోతను మిగిల్చాయి. సర్వస్వం కోల్పోయిన కుటుంబాలు తిరిగి నిలబడాలంటే ఉదారంగా సాయం అందించాల్సిందే. ఆ ఆసరా కోసమే బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో వరద నష్టాలను అంచనా వేయడానికి కేంద్ర బృందం బుధవారం వేమూరు నియోజకవర్గ పరిధిలో పర్యటించనుంది. దీంతో అన్ని విధాల నష్టపోయిన తమను గట్టెక్కించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందనే ఆశను ముంపు గ్రామాల ప్రజలు, అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. వరదల ధాటికి జరిగిన నష్టం దాదాపు రూ.600 కోట్ల వరకు ఉండొచ్చనేది అంచనా. జరిగిన నష్టానికి సంబంధించి విభాగాల వారీగా కేంద్రబృందం సభ్యులకు పీపీటీ ఇవ్వడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. వరద బీభత్సం మిగిల్చిన విషాదం తాలూకా గుర్తులను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా బృంద సభ్యులకు వివరించడానికి యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు ప్రాథమిక అంచనాల ప్రకారం జరిగిన నష్టమే దాదాపు రూ.250 కోట్లుగా ఉంది. ఇక కృష్ణా పశ్చిమ డెల్టా కింద ముంపునకు గురైన పొలాలన్నింటినీ కలుపుకుంటే ఒక్క వ్యవసాయ రంగానికి వాటిల్లిన నష్టమే అక్షరాల రూ.500 కోట్ల వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉండనుంది. బాపట్ల జిల్లా వ్యాప్తంగా చూస్తే 4,658 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లగా, వరికి సంబంధించి 37,000 హెక్టార్లు నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముంపు తగ్గి మూడు రోజులు గడుస్తున్నా ఇంకా దాదాపు 30,000 ఎకరాల్లో వరి, 3000 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీటిలోనే ఉన్నాయని రైతులు వాపోతున్నారు. వరదల వల్ల జలవనరుల శాఖ పరిధిలో దాదాపు రూ.27 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. కరకట్టల పటిష్టతతో పాటు కాలువల్లో పూడికతీత తీయడానికి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టడానికి దాదాపు రూ.187 కోట్లు ఖర్చు కానుందనే నివేదికను అధికారులు ఇచ్చారు

గృహాలు, రహదారులు, విద్యుత్...

4,870 ఇళ్లు పూర్తిగా ముంపునకు గురైతే, 3,200 వరకు తాత్కాలికంగా ముంపు బారిన పడ్డట్లు అధికారులు తేల్చారు. వీటికి జరిగిన నష్టం ప్రాథమిక లెక్కల ప్రకారం దాదాపు రూ.150 కోట్లుగా ఉండనుంది. విద్యుత్ శాఖకు రూ.80 లక్షలు, ఆక్వా రంగానికి రూ.80 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో నాలుగు లోలెవెల్ కాజెస్ సంబంధించి రూ.3 కోట్లు, 29 అంతర్గత రహదారులు పూర్తిగా పాడైపోయాయని వీటి మరమ్మతులకు తాత్కాలిక ప్రాతిపదికన మూడు కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేయగా, శాశ్వత నిర్మాణం కొరకు 155 కోట్లు అవుతుందని లెక్క కట్టారు. ఆర్అండ్‌బీ పరిధిలో 191 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని వీటి మరమ్మతులకు రూ.21 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వానికి నివేదించారు.

కేంద్ర బృందం పర్యటన ఇలా..

బుధవారం మధ్యాహ్నం వేమూరుకు కేంద్ర బృందం రానున్నది. జిల్లాలో వరద నష్ట తీవ్రతపై ఫొటో ప్రదర్శనను జిల్లా అధికారులు స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. దీనిని కేంద్ర బృందం పరిశీలించి భోజన విరామం అనంతరం పర్యటన ప్రారంభించనున్నది. కొల్లూరు మండలం ఈపురులంకలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను కేంద్ర బృందం పరిశీలించనుంది. అరవింద వారధి, పెసర్లంక, నక్కపాయ, పల్లెపాలెం, రావి అనంతవరం, చెరుకుపల్లి మండలం కనగాలలో కేంద్ర బృందం పర్యటించేలా అధికారులు రూట్‌ప్లాన్ రూపొందించారు.

రేపు లంక గ్రామాల్లో సీఎం పర్యటన

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరదల ధాటికి కకావికలమైన లంక గ్రామాల ప్రజల పరిస్థితి ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సీఎం చంద్రబాబు గురువారం పర్యటిం చనున్నారు. ఇందుకు సంబంధించిన సమాచారం మంగళవా రం సాయంత్రానికి అధికారులకు అందింది. దీంతో సీఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చేపడుతుంది. సీఎం పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్‌పై బుధవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వరదలు ఉధృతంగా ఉన్న ఈ నెల మొదటి వారంలోనే సీఎం పర్యటన జరగాల్సి ఉండగా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో వాయిదా పడింది.



బాపట్ల : మురుకుంటపాడులో ఇంకా ముంపులోనే వరి పైరు



అనధికార లేఅవుట్లు.. అడ్డుకునేవారేరి..?


చీరాల నియోజకవర్గంగా ఇష్టారాజ్యం • కట్టడి చేయని అధికారులు

చీరాల, సెప్టెంబరు 10 : చీరాల నియోజకవర్గంలో అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిపై చర్యల విషయంలో సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అనధికారిక లేఅవుట్లలో అవి పూర్తిస్థాయి అనుమతులులేని లేఅవుట్లని హెచ్చరిక బోర్డులు పెట్టమని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందుకు సంబంధించి నియోజకవర్గంలో కొన్ని చోట్ల చర్యలు చేపట్టారు. మరి కొన్ని చోట్ల హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో అంతిమంగా కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

చీరాల నియోజకవర్గంలో 81 అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. ఇవి కాకుండా పదులు సంఖ్యలో అదనంగా అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు అంచనా. ఒడా (ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వెల్లడించిన అనధికారిక లేఅవుట్లకు సం బంధించి సర్వే నెంబరు వివరాలు పొందుపరిచారు. యజమానుల పేర్లులేవు. దీంతో కొనుగోలు దారులు తికమక పడుతున్నారు.

వరదలతో మరలిన యంత్రాంగం దృష్టి

విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాలపై పాలకులు, అధికారులు బిజీ, బిజీగా ఉన్నారు. దీంతో అనధికారిక లేఅవుట్లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారుల దృష్టి కొంత పక్కకు మరలింది. దీన్ని ఆసరాగా చేసుకున్న అనధికారిక లేఅవుట్లు వేసిన వారు ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకునే పనిలో ఉన్నారు.



కొత్తపేట పరిధిలో అనధికారిక లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేస్తే చర్యలు..

ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే లేఅవుట్లు వేయాలి. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవు. కొనుగోలుదారులు కూడా పూర్తి సమాచారం తెలుసుకుని, అన్ని అనుమతులు ఉన్న స్థలాలను మాత్రమే కొనుగోలు చేయాలి.

- పార్వతి, తహసీల్దార్, వేటపాలెం మండలం

పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చాం

అనధికారిక లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయమని పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చాం. ఎక్కడన్నా ఇంకా హెచ్చరిక బోర్డులు లేకుంటే ఏర్పాటు చేయిస్తాం. అనధికారిక లేఅవుట్లు చట్టవిరుద్ధం. కొనుగోలు దారులు జాగ్రత్తగా ఉండాలి.

- హిమబిందు, ప్లానింగ్ ఆఫీసర్, ఒడా, ఒంగోలు

వరినారుకు.. డిమాండ్

సెంటు రూ.1400 నుంచి రూ. 2 వేలుకు పెరిగిన వైనం

బాపట్ల, సెప్టెంబరు 10 : వారం రోజులుగా కురిసిన వర్షాల ధాటికి ఉమ్మడి జిల్లా అంతా అతలాకుతలం అయింది. డెల్టాలోని వరి పొలాలు చాలా వరకు ముంపునకు గరయ్యాయి. దిగువ ప్రాంతాల్లో నారుమళ్ళు కుళ్ళిపోయిని. దీంతో నారుకు డిమాండ్ భారీగా పెరిగింది. దీంతో మరలా విత్తుకునేందుకు నారు అవసరమైన రైతులు బాపట్ల పరిసరప్రాంతాలకు పెద్దఎత్తున వస్తున్నారు. మొన్నటి వరకు సెంటు నారు 1000 రూపాయల లోపు విక్రయించిన రైతులు ప్రస్తుతం 1400 నుంచి 2వేల రూపాయల వరకు డిమాండ్‌ను బట్టి విక్రయిస్తున్నారు. బాపట్ల, కర్లపాలెం మండలాలలోపాటు రాంభొట్లపాలెం, చెరుకుపల్లి ప్రాంతాల్లోని గరువు, మెరకభూములలో రైతులు నారు పెంచి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం డిమాండ్‌ను బట్టి రైతులు నారు విక్రయిస్తున్నారు. కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం, పాతనందాయపాలెం, ఎం.వి.రాజుపాలెం, ఏట్రవారిపాలెం పరిసరప్రాంతాలలో వరినారు విక్రయాలు జరుగుతున్నాయి. బాపట్ల మండలంలోని ధరివాదకొత్తపాలెం, పాతపాలెం గ్రామాలలో వరినారు విక్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి అనేకప్రాంతాల రైతులు ఇక్కడకు వచ్చి నారు కొనుక్కెళుతున్నారు. నరసరావుపేట, నండూరు, రేటూరు, అప్పాపురం, కాకుమాను ప్రాంతాలకు చెందిన రైతులు వచ్చి నారు తీసుకెళుతున్నారు. రైతుల డిమాండ్‌ను బట్టి ఇక్కడ రోజుకోక ధర చెబుతున్నారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో ముంపుకుగురైన పొలాలలో పైరు దెబ్బతిన్న రైతులు నారు కొనుగోలు చేస్తున్నారు. స్థానిక రైతులతోపాటు ఇతర ప్రాంతాల రైతులు కూడా రావటం వల్ల డిమాండ్ బాగా పెరిగింది. నష్టపోయిన రైతులలో కొందరు ఇంత ధరపెట్టి నారు కొనుగోలు చేయలేక ఉన్నవరకు చాలంటూ పొలాలను వదిలేస్తున్నారు. బీపీటీ 5204, 1262 రకాల నారు ఎక్కువగా లభిస్తున్నది. కొంతమంది రైతులు నారు విక్రయించకుండా ఇంకా రేటు వస్తుందని ఎదురు చూస్తున్నారు. వరద ప్రబావం ఈవిధంగా రైతులపై భారంగా మారింది.



ఎంవీ రాజుపాలెంలో నారు తీస్తున్న రైతులు

వరద బాధితులకు రూ.54 లక్షలు

- సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేసిన గ్రానైట్ యజమానులు

బల్లికురవ, సెప్టెంబరు 10 : విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు బల్లికురవ గ్రానైట్ క్వారీ యజమానులు ముందుకు వచ్చారు. మంగళవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రూ.54 లక్షల చెక్కును అందజేశారు. చంద్రబాబు వారిని అభినందించారు. విరాళాలు ఇచ్చిన 15 గ్రానైట్ క్వారీల యజమానులు ముందుగా విద్యుత్ మంత్రి గొట్టిపాటి, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిశారు. కార్యక్రమంలో గ్రానైట్ క్వారీల యజమానులు ధూళిపాళ్ల శ్రీకాంత్, ఒట్టికొండ ఆంజనేయులు, ప్రత్తిపాటి సురేష్, మారం వెంకారెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, టి.వినోద్‌కుమార్, పొత్తూరి వెంకట్రావు, ఉప్పుటూరి కృష్ణారావు, ఇంపీరియల్ సురేష్, జి.శ్రీను, పి.సురేష్ ఉన్నారు.



సీఎంకు చెక్కును అందజేస్తున్న బల్లికురవ మండల గ్రానైట్ క్వారీ యజమానులు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యత పరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు

1. బహుళ ప్లాట్‌ఫాం నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అమలులోకి వస్తుంది.

- ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.

- బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.
- అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.
- అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.
2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.
3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిక్సూచి

Santoor Scholarship

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have: ● passed Class 10 from a local government school. ● passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And ● enrolled in a full-time graduate programme starting in 2024-25.

● Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. ● Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 23-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT
Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

● Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 20-09-2024
Url: www.b4s.in/aj/ASPI2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

హై వోల్టేజ్ యాక్షన్‌తో వస్తున్నాం

ఎన్టీఆర్



'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం తర్వాత నా సోలో మూవీగా 'దేవర' మీ ముందుకొస్తోంది. కొంచెం ఒత్తిడిగా ఉంది. రిలీజ్ కోసం మీతో పాటు నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. హై వోల్టేజ్ యాక్షన్‌తో ఈ చిత్రం రాబోతోంది' అని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. మంగళవారం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. కరడుగట్టిన సముద్ర దొంగల నుంచి గ్రామాన్ని రక్షించేందుకు కథానాయకుడు చేసిన పోరాటం నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. తండ్రీ కొడుకులుగా రెండు విభిన్న పాత్రల్లో ఎన్టీఆర్ పలికించిన భావోద్వేగాలు అలరించాయి. పల్లెటూరి యువతిగా జాన్వీ కనిపించారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'దేవర విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. సముద్ర జలాలఅడుగున చిత్రీకరణ చేశాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. శివ కొరటాల మాట్లాడుతూ 'సెట్స్‌లో ఒక్కసారి కెమెరా ఆన్ అయిందంటే ఎన్టీఆర్ సర్వం మర్చిపోయి పాత్రలో లీనమై నటిస్తాడు. అప్పట్లో సీనియర్ ఎన్టీఆర్-శ్రీదేవిలా ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్-జాన్వీకపూర్ జోడీ బాగుందని ప్రేక్షకులకు మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. జాన్వీకపూర్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో కలసి నటించాలనే నా కోరిక 'దేవర'తో తీరింది. ఆయనకు నేను పెద్ద అభిమానిని. ఎన్టీఆర్ నుంచి నటనకు సంబంధించి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను' అని తెలిపారు.

కాలేజ్ రోజులు గుర్తొచ్చాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర జంటగా నటించిన 'ఉత్సవం' చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో రెజీనా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చిత్రవిశేషాలు వెల్లడించారు.

- ఈ చిత్రకథను దర్శకుడు అర్జున్ సాయి చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. కథలో సోల్ ఉంది. నాటకరంగం గురించి ఆయన చాలా రిసెర్చ్ చేసి కథ తయారు చేశారు. స్కూల్‌లో, కాలేజీలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వెయ్యడం, టికెట్లు అమ్మడం.. ఇవన్నీ నాకు వెంటనే గుర్తొచ్చాయి. సినిమాలో రంగస్థల నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి. 'ఉత్సవం' సందేశాత్మక చిత్రం కాదు. కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా. నాకు బాగా నచ్చి వెంటనే ఒప్పుకొన్నా.
- చిత్రంలో నేను కార్పొరేట్ ఎంప్లాయిగా నటించాను. ప్రేమ మీద నా పాత్రకు పెద్దగా ఆసక్తి ఉండదు. కథలో ఎంతో కీలకమైన పాత్ర. ఇటువంటి పాత్ర చేసే అవకాశం రావడం ఆనందంగా అనిపించింది.
- నా కో స్టార్ దిలీప్ మంచి నటుడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. తనతో వర్క్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నటుడిగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. అలాగే రాజేంద్రప్రసాద్, ప్రకాశ్‌రాజ్, నాజర్ వంటి సీనియర్స్‌తో కలసి నటించడం వల్ల చాలా నేర్చుకున్నాను. దర్శకుడు అర్జున్ సాయి తన తొలి సినిమాకు ఇలాంటి గొప్పకథను ఎన్నుకోవడం, ఆయనకు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ సపోర్ట్ ఇచ్చి సినిమాను విడుదల చేయడం హ్యాపీగా అనిపిస్తోంది.
- నా తొలి సినిమా 'ఎస్.ఎం.ఎస్.' చేస్తున్నప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నాను. అందుకే ఇన్నాళ్లూ విభిన్న పాత్రలు చేస్తూ వచ్చాను. అన్ని రకాల పాత్రలు చేయడమే నా గోల్

కొన్నేళ్లుగా బాలీవుడ్ బాక్సాఫీసు.. థియేటర్లు సరైన హిట్లు లేక వెలవెలబోతున్న సంగతి తెలిసిందే. అలాంటి సమయంలో నేనున్నానంటూ బాలీవుడ్‌ను ఆదుకున్నాయి కొన్ని సినిమాలు. విచిత్రమేమిటంటే అందులో అధిక శాతం 'హారర్' జానర్‌కు చెందిన చిత్రాలే. అలా ఈ ఏడాది బాక్సాఫీస్‌కు కళ తెచ్చిన తెచ్చిన హారర్ చిత్రాలేంటో.. అలాగే త్వరలో ప్రేక్షకులను పలకరించే చిత్రాలేంటో చూద్దాం.

బాక్సాఫీస్‌కు హారర్ జోరు





ఏ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా రిలీజై సంచలన విజయం సాధించిన చిత్రం 'ముంజ్య'. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో అభయ్ వర్మ, శర్వారీ, మోనా సింగ్ కీలక పాత్రలు పోషించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో జూన్ 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో తన ప్రేయసిని ముంజ్యా (బ్రహ్మ రాక్షసుడు) నుంచి కాపాడుకునేందుకు హీరో పడే పాట్లు.. చేసే ఫీట్లు





అందర్నీ తెగ నవ్వించాయి. పిల్లలను నిద్రపుచ్చడానికి పెద్దలు చెప్పే జానపద కథలా.. కామెడీ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే ఓటీటీలో విడుదలై అందరినీ అలరిస్తోంది.

వసూళ్ల వర్షం

శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నేచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2'. ఇది 2018లో తెరకెక్కి సూపర్ హిట్ సాధించిన 'స్త్రీ' సినిమాకు సీక్వెల్. రాజ్‌కుమార్ రావు కథానాయకుడు. ఆగస్టు 15న విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ఇప్పటికే ఈ చిత్రం దాదాపు రూ.530 కోట్లు వసూలు చేసింది. బాలీవుడ్‌లో 'ఫైటర్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలు సాధించిన కలెక్షన్లను అధిగమించింది. అంతే కాకుండా షారుక్ ఖాన్ నటించిన 'పఠాన్' చిత్రం ఇండియాలో సాధించిన లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసి.. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధించిన రెండో హిందీ మూవీగా 'స్త్రీ 2' నిలిచింది. ఈ కలెక్షన్ల పరంపర ఇలాగే కొనసాగితే త్వరలోనే ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లతో టాప్ ప్లేస్‌లో ఉన్న షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాను దాటేస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక, ఈ సినిమా కథాంశానికి వస్తే.. చందేరి అనే ఓ ఊరిలో హఠాత్తుగా మహిళలు కనిపించకుండా పోవడం, వారిని కాపాడడం కోసం రాజ్‌కుమార్ రావు, తన స్నేహితులతో చేసే పనులు ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ.. ప్రేక్షకులకు సూపర్ థ్రిల్‌ను పంచాయి. అలాగే, ఈ సినిమాకు తమన్నా చేసిన ప్రత్యేక గీతం కూడా కలిసొచ్చింది. ఇప్పటివరకూ దేశంలో తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమా కూడా ఇదే. ఈ సినిమాకు మూడో భాగం ఉన్నట్లు చిత్రబృందం తెలిపింది.



మూడు రెట్ల లాభాలు

అజయ్ దేవ్‌గణ్, ఆర్.మాధవన్, జ్యోతిక నటించిన హారర్ థ్రిల్లర్ 'షైతాన్'. వికాశ్ భల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 8న విడుదలై మంచి హిట్‌గా నిలిచింది. రూ.65 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. ఇందులో మాధవన్ వశీకరణం మాయలో పడిన తన కూతురిని రక్షించుకోవడం కోసం అజయ్‌దేవ్‌గణ్ చేసే పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలిచింది. త్వరలోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'షైతాన్ 2'ని తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

త్వరలో మరిన్ని..

'స్త్రీ 2' చిత్రం ఊహకు మించిన సక్సెస్ సాధించడంతో బాలీవుడ్ చూపు ఒక్కసారిగా హారర్ ఫ్రాంచైజీలపై పడింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న హారర్ చిత్రాల్లో 'భూత్ బంగ్లా', 'భేడియా 2', 'భూల్ భులయ్యా 3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'భూత్ బంగ్లా' చిత్రం అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా, ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ హారర్ కామెడీని అక్షయ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా ప్రకటించారు. 'భేడియా 2' విషయానికి వస్తే.. ఇది 2022లో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటించిన 'భేడియా' చిత్రానికి సీక్వెల్. కృతి సనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకుడు. ప్రస్తుతం రెండో భాగం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మరోవైపు, 'భూల్ భులయ్యా 3' చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, త్రిప్తి దిమ్రి నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని రాబట్టాయి. మూడో భాగం దీపావళి సందర్భంగా నవంబర్ 1న విడుదలవుతోంది. వీటిలో ఏ చిత్రాలు 'స్త్రీ 2' లాగా సంచలన విజయాలు సాధిస్తాయో అని అందరూ వేచి చూస్తున్నారు.



ప్రభాస్‌కు కమల్ గిఫ్ట్..



కమల్ హాసన్ 'కేహెచ్' హౌస్ ఆఫ్ ఖద్దర్ అనే బ్రాండ్‌తో ఖాదీ దుస్తుల వ్యాపారంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే, న్యూయార్క్‌లో జరిగిన ఫ్యాషన్ వీక్‌లో ఈ దుస్తులకు చెందిన సరికొత్త కలెక్షన్ 'సుటూర'ను ప్రదర్శించారు. ఈ సరికొత్త కలెక్షన్‌ను కమల్ హాసన్ తన 'కల్కి 2898 ఏ.డీ' కో స్టార్ ప్రభాస్‌కు కానుకగా పంపారు. ఈ కానుకను అందుకున్న ప్రభాస్.. తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ప్రేమతో ఈ గిఫ్ట్ పంపించినందుకు కృతజ్ఞతలు కమల్ సర్. మీ కొత్త కలెక్షన్‌కు ఆల్ ద బెస్ట్" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో.. భైరవ పాత్రలో ప్రభాస్.. 'సుప్రీమ్ యాస్కిన్' పాత్రలో కమల్ హాసన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే.

విజయంపై నమ్మకంతో ఉన్నాం




మలయాళ హీరో టోవినో థామస్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఏఆర్ఎం' (అజయంతే రందం మోషణం). జితిన్ లాల్ దర్శకుడు. కృతిశెట్టి, ఐశ్వర్యారాజేశ్, సురభి లక్ష్మి కథానాయికలు. ఈ నెల 12న పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా టోవినో థామస్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్ అంటే తెలుగు పరిశ్రమలో ఒక బ్రాండ్. వారు మా సినిమాను తెలుగులో విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఇందులో మూడు పాత్రలు చేశాను. కృతి శెట్టి పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. కృతిశెట్టి మాట్లాడుతూ 'హీరోయిన్‌గా నాకు ఇది తొలి మలయాళ చిత్రం. దర్శకుడు అద్భుతమైన కథతో ఎనిమిదేళ్ల పాటు కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.



వరదబాధితులను ఆదుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి నిర్మాత దిల్‌రాజు, శిరీష్ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. వారు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి రూ. 25 లక్షల చెక్కును అందజేశారు.

రాముడిగా...పరశురాముడిగా?



రణ్‌బీర్‌కపూర్ శ్రీరాముడి పాత్రధారిగా 'రామాయణ్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రాతో కలసి యష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీతమ్మవారి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నారు. యష్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సన్నీడియోల్, లారాదత్తా, రకుల్ ప్రీత్‌సింగ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. 2026లో తొలి భాగం విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బాలీవుడ్‌లో వినిపిస్తోంది. రణ్‌బీర్‌కపూర్ ఇందులో డబుల్ రోల్‌లో కనిపించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రాముడి పాత్రతో పాటు పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించనున్నారట. ఆయన లుక్ కూడా సరికొత్తగా ఉండబోతోందని చెబుతున్నారు. రామాయణంలో సీతా స్వయంవరంలో శ్రీరాముడు శివ ధనుర్భంగం నేపథ్యంలో పరశురాముడి పాత్ర కనిపిస్తుంది. 'రామాయణ్'లో అమితాబ్ బచ్చన్ కూడా భాగమవబోతున్నారట. అయితే ఆయన ఈ చిత్రంలో నటించడం లేదు. జటాయు పక్షి పాత్రకు అమితాబ్‌బచ్చన్ డబ్బింగ్ చెప్పేందుకు అంగీకరించాని సమాచారం. ఇక ఈ చిత్రంలో రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ డిసెంబర్‌లో చిత్రీకరణలో పాల్గొంటారని చెబుతున్నారు.

శింబు సాయం



ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడానికి భాషా పరిమితులు, ప్రాంతీయ భేదాలు ఉండవని తమిళ హీరో శింబు నిరూపించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులకు గురైన వారిని ఆదుకోవడానికి ఆయన ముందుకు వచ్చారు. ఇతర తమిళ హీరోలందరికన్నా ముందుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తన వంతు సాయంగా రూ. ఆరు లక్షల విరాళం ప్రకటించి తన మంచితనాన్ని చాటుకున్నారు. అందరూ ఈ విపత్తు నుంచి త్వరలో బయటపడాలని ఆయన కోరుకున్నారు.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌కు జరిగిన తాజా ఎన్నికల్లో అధ్యక్షపదవికి ప్రతాని రామకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదహారు వేల మంది సభ్యులున్న అసోసియేషన్‌కు ఇలా అధ్యక్షపదవికి ఆయన ఎన్నిక కావడం ఇది ఆరోసారి. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు. ఈ రెండేళ్ల పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఔట్‌డోర్ షూటింగ్స్ సమయంలో యూనిట్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, చిన్న సినిమాలకు రాయితీలు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం' అని చెప్పారు.

లైఫ్ స్టోరీ

కొత్తగా..



ఒక్కోసారి సాధారణ సంఘటనలే జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. అలా జీవితంలోని రోజువారీ క్షణాలను మనసుకు హత్తుకొనే విధంగా తీసిన సంకలన చిత్రం 'లైఫ్ స్టోరీస్'. ఈ నెల 14న విడుదలవుతున్న ఈ సినిమాలో సత్య కేతినీడి, షాలిని కొండేపూడి, దేవియాని శర్మ, ఎం. వివాన్ జైన్ తదితరులు నటించారు.అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా స్వీయ దర్శకత్వంలో ఉజ్వల్ కశ్యప్ ఈ సినిమాను నిర్మించారు.

168 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



లారీలో లోడ్ చేసిన రేషన్ బియ్యం

తిమ్మాపురం(యడ్లపాడు), సెప్టెంబరు 10: యడ్లపాడు మండలం తిమ్మాపురంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పరిధిలోని విజయకాటన్ మిల్లు గోడౌన్‌లలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్టు ముందస్తు సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. అప్పటికే గోడౌన్ నుంచి లారీలోకి ఎత్తి తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యంతో పాటు గోడౌన్‌లో నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీలో లోడ్‌చేసిన 337 బ్యాగులలో 132 క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు 36 క్వింటాళ్ల నూకలు ఉన్నట్లు తహసీల్దార్ విజయశ్రీ నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు తేల్చారు. మిల్లు గోడౌన్‌లోని బ్యాగుల్లో మరో 10 క్వింటాళ్ల వరకు ఉండవచ్చని అంచనా వేశారు. సొలస గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి విజయా కాటన్ మిల్లుకు చెందిన గోడౌన్లను లీజుకు తీసుకుని కేవీఆర్ ట్రేడర్స్ పేరుతో అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. గోడౌన్‌లో బియ్యం పాలిష్ చేసేందుకు, నూకలుగా మార్చడానికి యంత్రాలను కూడా ఏర్పాటు చేసుకున్నాడన్నారు. నిందితునిపై కేసు నమోదుచేసి బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

విలేకరులపై దౌర్జన్యం

సంఘటనా స్థలానికి వెళ్లిన విలేకరులతో అక్కడ సూపర్‌వైజర్‌గా ఉన్న సాయి తేజ వాగ్వాదానికి దిగాడు. తాను ప్రసాద్ బావమరిదిని అని, తన అనుమతి లేకుండా మిల్లులోకి ఎందుకు వచ్చారంటూ విలేకర్లపై మండిపడ్డాడు. ఫొటోలు తీయడానికి వీల్లేదు తక్షణమే ఇక్కడ నుంచి వెళ్లి పోవాలంటూ ఆవేశంతో ఊగిపోయాడు. అధికారులు బియ్యం పట్టుకున్నారన్న సమాచారంతో వచ్చామని విలేకరులు గట్టిగా బదులు చెప్పడంతోపాటు సంఘటన జరిగినప్పుడు విలేకరులు వస్తారని వీఆర్వో చెప్పడంతో అతను వెనక్కి తగ్గాడు.

విపత్తుకు భారీగా విరాళాలు



చెక్కు అందజేస్తున్న కారుమంచి ప్రసాద్



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న పీవీఎస్ సంస్థల చైర్మన్ శేషయ్య



పవన్‌కు అంగీకార పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

ప్రసాద్ సీడ్స్ చేయూత

గుంటూరు, సెప్టెంబరు 10: వరద బాధితులకు చేయూతనందించేందుకు ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ రూ.50 లక్షల చెక్కును మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయం అందజేసినట్లు తెలిపారు.

అమరావతి రైతుల ఆధ్వర్యంలో..

తుళ్లూరు, సెప్టెంబరు 10: ఓ వైపు రాజధాని అమరావతి రైతులు వరద బాధితులకు ఆహారం అందజేస్తూనే, మరో వైపు సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మంగళవారం సాయంత్రం విజయవాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఎస్.సవిత చేతుల మీదగా రూ.3.30 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. చంద్రబాబు వారిని అభినందించారు. రైతులు చిట్టిబాబు, అనిల్, శ్రీధర్, శ్రీనివాస్ సహా 29గ్రామాలకు చెందిన కొంతమంది పాల్గొన్నారు.

సర్పంచుల నెల వేతనం వితరణ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 10: ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌరవ సర్పంచులు ఒక నెల గౌరవ వేతనాన్ని రూ 3,92,91,000 ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందజేశారు. మంగళవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు ఈ సాయానికి సంబంధించిన అంగీకార పత్రాన్ని ఆయనకు అందజేశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి కృష్ణమోహన్, సభ్యులు నాగమణి ,అశోక్, శ్రీరామ్ మూర్తి, ఇంద్ర సేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీవీఎస్ సంస్థల విరాళం

మంగళగిరి, సెప్టెంబరు 10: బుడమేరు వరద ముంపు బాధితుల సహాయార్థం పీవీఎస్ గ్రూపు సంస్థల చైర్మన్ డాక్టర్ పాములపాటి వెంకట శేషయ్య రూ.10 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. విజయవాడ కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు చెక్కును మంగళవారం అందజేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గుంటూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ...

గుంటూరు విద్య సెప్టెంబరు 10: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూలు అసోసియేషన్ గుంటూరు విభాగం రూ.2 లక్షలు, ఆక్స్ఫర్డ్, ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ స్కూల్ వారు రూ.5 లక్షలు చెక్కులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి మంగళవారం అందజేశారు. జిల్లా విద్యాశాఖ శైలజ, స్కూళ్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల వితరణ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 9: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం స్థానిక డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తమవంతు వితరణ ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు రూ. 1.15లక్షలు, ఉపాధ్యాయులు రూ. 85వేలు మొత్తం రూ. 2లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. వెలగపూడిలోని సీఎం నారా చంద్రబాబు నాయుడు నివాసంలో ఈ మొత్తాన్ని స్కూల్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, ఆర్వీఆర్అండ్‌జేసీ కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, కేఎల్‌పీ స్కూల్ ప్రిన్సిపల్ జి రత్తయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు కనపర్తి రూ. 2 లక్షల విరాళం

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు రూ. 2 లక్షల విరాళం అందజేశారు. భారీ వరదలకు సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ఆయన విజయవాడ కలక్టరేట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర కార్పోరేటర్ వేములపల్లి శ్రీరామప్రసాద్, నాయకులు పఠాన్ అస్మతుల్లా, షేక్ ఖరీం పాల్గొన్నారు.



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు



సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేస్తున్న రాయపాటి గోపాలకృష్ణ, జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ కృష్ణప్రసాద్



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కనపర్తి

14వ మైలు సెంటర్‌లో ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే శంకరరావు పర్యటనను అడ్డుకునేందుకు భారీగా చేరుకున్న టీడీపీ శ్రేణులు
- టీడీపీ వర్గీయుల దాడిలో వైసీపీ నాయకుని కారు ధ్వంసం



శంకరరావును అడ్డుకునేందుకు వైకుంఠపురంలో టీడీపీ శ్రేణులు


అమరావతి, సెప్టెంబరు 10: వరద ముంపు వలన దెబ్బతిన్న పంటలను, గృహాలను, బాధితులను పరామర్శించేందుకు మంగళవారం వస్తున్నానని పెదకూరపాడు నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం ప్రకటించారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వరద సాయంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాదిరిగానే రాజకీయం చేయడానికి వస్తున్నాడని ఆగ్రహంతో శంకరరావు పర్యటనను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం ఉదయం నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు వందలాదిగా వైకుంఠపురం, లేమల్లె గ్రామంలోని 14వ మైలు సెంటర్ వద్దకు చేరుకుని శంకరరావు ఏమార్గంలో వచ్చినా అడ్డుకుని గోబ్యాక్ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. తమ నాయకుడు వస్తున్నాడని వైసీపీ శ్రేణులు కూడా లేమల్లె గ్రామంలో ఉండి ఆయన రాకకోసం ఎదురు చూస్తున్నారు. టీడీపీ శ్రేణులు అడ్డుకుంటారన్న సమాచారంతో శంకరరావు తన పర్యటన రద్దు చేసుకున్నారు. దీంతో వైసీపీ శ్రేణులు లేమల్లె గ్రామం నుంచి వెళ్లిపోయారు. ఇంతలో లేమల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వాసు తన కారును తీసుకునేందుకు వస్తుండగా టీడీపీకి చెందిన కొందరు నీవు ఎక్కడికిరా అంటూ అతని కారుపై దాడి చేసి అద్దాలు పగుల గొట్టారు. అప్పటికే బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు టీడీపీ వర్గీయులను వారించి పంపించి వేశారు. ఈ ఘటనతో లేమల్లెలో ఉద్రిక్తత వాతావరణం నెలకుంది.

ప్రజలను రెచ్చగొట్టేందుకే పర్యటన

వరద ముంపు జరిగి పది రోజులైన తరువాత ముంపు ప్రాంతాల్లో పర్యటన పేరుతో పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను సమీకరించడం ప్రజలను రెచ్చగొట్టేందుకే అని అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటమి పాలైన శంకరరావు వంద రోజుల వరకు నియోజకవర్గానికి రాకుండా నేడు వరద సాకుతో వచ్చి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే ప్రజలు ఆయన పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. శంకరరావు మూడు రాజధానులకు వ్యతిరేకంగా అమరావతి మాత్రమే రాజధాని అని ప్రకటిస్తేనే నియోజకవర్గంలోని అడుగుపెట్టేందుకు ప్రజలు అంగీకరిస్తామని హనుమంతరావు అన్నారు. టిడీపీ నాయకురాలు వేగుంట రాణి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రతిగ్రామంలో పర్యటించి వరద బాధితులకు భరోసా కల్పించారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త నాయుడమ్మ స్ఫూర్తితో శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన అభివృద్ధి

- పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్
- ఎన్‌సీఎల్ సీఎండీ ప్రసన్నకుమార్‌కు నాయుడమ్మ పురస్కారం



నాయుడమ్మ పురస్కారంతో ప్రసన్నకుమార్, రాధిక దంపతులను సత్కరిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 : దేశానికి చర్మ రంగంలో మంచి పేరు తెచ్చి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగిన దివంగత యలవర్తి నాయుడమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం నాయుడమ్మ స్మారక పురస్కారాన్ని నేషనల్ లిగ్నేట్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్‌కు ప్రదానం చేశారు. యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాదబాబు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాంతం గర్వించదగ్గ వ్యక్తిగా నాయుడమ్మ ఉన్నత స్థానం చేరారని, శాస్త్రవేత్తలతో అవినాభావ సంబంధాన్ని నెలకొల్పారని చెప్పారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీని గ్రీన్ హైడ్రోజన్‌గా మార్చే లక్ష్యాన్ని పెట్టుకున్నారని ఇందులో భాగంగా సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేస్తామన్నారు నాయుడమ్మ ఆదర్శాలను ముందుకు తీసుకు వెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ ప్రాంతంలో ఆయన పేరు మీద మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులు, యువతలో స్ఫూర్తి నింపాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి యువత ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తామన్నారు. అవార్డు గ్రహీత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, దేశంలో విద్యుత్ తలసరి వినియోగం 1350 కిలోవాట్స్ ఉందని, దానిని 2047కు 12500 కిలోవాట్స్‌కు చేర్చే లక్ష్యంగా ప్రధాని మోదీ వికాసిత్ భారత్‌కు పిలుపునిచ్చారని చెప్పారు. సోలార్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వంతో పాటు కార్పొరేషన్ పని చేస్తుందన్నారు. 2070 నాటికి కార్బన్ ఉద్గారాల విడుదల సున్న శాతం నమోదు అయ్యే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. గుజరాత్‌లో మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సోలార్ పవర్ ఉత్పత్తికి వేసిన పునాది కారణంగా నేడు ఆ రంగంలో 1.50 లక్షల మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని దానిని 2030 నాటికి 1.50 గిగావాట్ల ఉత్పత్తికి చేర్చడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చెన్నై చర్మ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త స్వర్ణ వి కాంత్ మాట్లాడుతూ, చిన్న పల్లెటూరు నుంచి దేశంలోనే అత్యున్నత శాస్త్రవేత్తగా ఎదిగిన నాయుడమ్మ తమ సంస్థ చేసే ప్రతి పనిలోనూ స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తమ సంస్థకు పెద్ద చాలెంజ్ పెట్టిందని, అన్ని రకాల చర్మ ఉత్పత్తులు 50 శాతం పెంచి ఎగుమతి చేయాలని లక్ష్యం పెట్టిందన్నారు. ఇందుకు నాయుడమ్మ చూపిన బాటే తమను ముందుకు నడిపిస్తుందని, చర్మ పరిశోధన సంస్థ ఉత్పత్తుల్లో కాలుష్యాన్ని పూర్తి స్థాయిలో నిరోధించగలిగామన్నారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, యలవర్తి పవన్‌కుమార్ ప్రసంగించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు.

వరద బాధితులకు రూ. 25 లక్షలు : ఎమ్మెల్యే జీవీ

వినుకొండటౌన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థ వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు 25 లక్షల రూపాయల విరాళాన్ని మంగళవారం ప్రకటించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి చెక్కును అందజేస్తానని తెలిపారు. సర్వం కోల్పోయి అపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న వరద బాధితులను ఆదుకోవడానికి తన శివశక్తి బయో టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ, శివశక్తి ఫౌండేషన్ ద్వారా రూ. 25 లక్షలు ఆర్థిక సాయాన్ని చెక్కు రూపేన అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

హౌరా - ఎస్ఎస్‌పీఎన్ వీక్లీ రైలు యశ్వంత్‌పూర్‌కు పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా వారంలో ఒక రోజు హౌరా - శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మధ్యన రాకపోకలు సాగిస్తున్న సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌ని యశ్వంత్‌పూర్ వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఈ నెల 25వ తేదీన నంబరు. 22831 రైలు హౌరాలో మధ్యాహ్నం 2.50కి బయలుదేరి 26వ తేదీన ఉదయం 10.30కి గుంటూరుకు వస్తుంది. ఈ రైలు గురువారం అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ చేరుకొంటుంది. నంబరు. 22832 రైలు యశ్వంత్‌పూర్‌లో ఈ నెల 27వ తేదీన వేకువజామున 5 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.55కి గుంటూరు, 28వ తేదీన మధ్యాహ్నం 1.25కి హౌరా చేరుకొంటుంది. దీని వలన యశ్వంత్‌పూర్(బెంగళూరుకు సమీప స్టేషన్)కు కొత్తగా రైలు కనెక్టివిటీ గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది.

కొల్లం, సికింద్రాబాద్‌లకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓనం పండగ రద్దీ దృష్ట్యా ఈ నెల 13న సికింద్రాబాద్ - కొల్లం ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. నంబరు. 07119 సికింద్రాబాద్ - కొల్లం స్పెషల్ ఈ నెల 13న రాత్రి 5.30కి బయలుదేరి రాత్రి 7.59కి నడికుడి, 8.19కి పిడుగురాళ్ల, 8.44కి సత్తెనపల్లి, 10.15కి గుంటూరు, 14వ తేదీ రాత్రి 11.20కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07120 కొల్లం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 15న ఆదివారం వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.35కి గుంటూరు, 3.29కి సత్తెనపల్లి, 3.59కి పిడుగురాళ్ల, 4.29కి నడికుడి, సోమవారం ఉదయం 10.30కి సికింద్రాబాద్ చేరుకొంటుందని పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది శిక్ష

మంగళగిరి, సెప్టెంబరు 10: చెక్కు బౌన్సు కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.5,50,000 కాంపెన్‌సేషన్ ఫిర్యాదుదారునికి చెల్లించాలంటూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరికి చెందిన వడితే నరేష్ వద్ద కొల్లిపర నివాసి ప్రస్తుతం బాపట్ల సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో సబార్డినేట్‌గా పని చేస్తున్న తూమాటి పీటర్ రూ.4 లక్షలు కుటుంబ ఖర్చుల నిమిత్తం తీసుకుని అనంతరం 2021లో రూ.5,50,000లు చెల్లించే విధంగా చెక్కు ఇచ్చారు. ఫిర్యాది నరేష్ తన చెక్కును మంగళగిరి ఎస్‌బీఐలో వేయగా నగదు లేవని రావడంతో ఫిర్యాది చట్ట ప్రకారం పీటర్‌పై చర్యలు తీసుకుంటూ మంగళగిరి కోర్టులో ఎన్ఐ యాక్టు కింద కేసు దాఖలు చేశారు. ఈ కేసు ఇటీవల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణకు రాగా వాదోపవాదాల అనంతరం నిందితుడైన పీటర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5,50,000 కాంపెన్‌సేషన్ చెల్లించాలంటూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అప్పీలుకు నెల రోజుల గడువు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ వారిపై వైసీపీ కార్యకర్తల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ, శివ

బెల్లంకొండ, సెప్టెంబరు 10: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడి చేసిన సంఘటన జరిగింది. ఈ సంఘటనలో చంద్రాజుపాలెం టీడీపీ కార్యకర్తలు గుంజా శివ, రామకృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రాజుపాలెంలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఊరేగింపు సోమవారం నిర్వహిస్తున్నారు. ఈ ఊరేగింపులో తెలుగుదేశం పార్టీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి విగ్రహాలను ఆపి డీజేలతో వైసీపీకి చెందిన పాటలను ఏర్పాటు చేస్తుండగా టీడీపీ కార్యకర్తలైన గుంజా శివ, డాక్టర్ రామకృష్ణ ప్రశ్నించటంతో వైసీపీ నాయకులు రెచ్చి పోయి ఇద్దరి టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. కర్రలతో, రాడ్లతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిరువురిని స్థానికులు వెంటనే సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైసీపీ చెందిన రామకోటిరెడ్డి, కోటేశ్వరరావు, వీరితో పాటు మరో పది మంది వైసీపీ యువకులు దాడిలో పాల్గొన్నట్టు బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలి

టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఎస్ఐ రాజును కలసి విన్నవించారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసినప్పటికీ నోరు మెదపలేదనీ, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో కూడా కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని తెలిపారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారు గ్రామంలో తిరుగుతున్నప్పటికీ పోలీసులు ఇంతవరకు వారిని అదుపులోకి తీసుకోలేదన్నారు. టీడీపీ నేతలు అక్కల వెంకట రామిరెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, మాజీ సర్పంచులు హనుమంతరావు నాయక్, హుస్సేన్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 10: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 26 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,09,248 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 589.50 అడుగులు ఉంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2210 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,09,248 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,51,238 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,78,905 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

41,540 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 33,828 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 41,540 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 17,575 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	16000	334	7500	14700
నెంబరు. 5	10000	15500	నెంబరు. 5	10800	14000
273	11000	13800	273	--	--
341	8000	16500	341	7500	16000
4884	--	--	4884	--	--
సూపర్ 10	10700	10700	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	9000	18700	తేజ	8200	18500
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	8600	14500	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5500	11500

సీఎం సహాయ నిధికి రూ.6లక్షల విరాళం


సీఎం సహాయనిధికి చెక్కు అందజేస్తున్న గోవాడ గ్రామస్థులు

అమృతలూరు, సెప్టెంబరు 10: వరద సహాయ బాధితులకు గ్రామస్థులు తమ వంతు సాయం అందించారు. మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు, గ్రామస్థుల విరాళంతో 6లక్షల రూపాయల చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మంగళవారం అందజేశారు. విజయవాడ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రిని కలిసి చెక్కు అందించారు. కార్యక్రమంలో మండవ రమేష్, ఉప్పల సాంబశివరావు, కాట్రగడ్డ రాధాకృష్ణలు పాల్గొన్నారు.

జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోవాలి

● జిల్లా జడ్జి డి.శ్రీనివాసులు

బాపట్ల,సెప్టెంబరు 10: న్యాయ సేవాధికారం సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ శనివారం నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోవాలని తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జి, బాపట్ల మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. కోర్టు ప్రాంగణంలో నిర్వహించే లోక్ అదాలత్‌తో అన్ని రకాల సివిల్, భరణం, గృహ హింస, వాహన ప్రమాద కేసులతోపాటు రెవెన్యూ, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్, క్రిమినల్ కేసులు, ముందస్తు రాజీ చేసుకోదలిచిన కేసులు, ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి పరిష్కరించవచ్చునని అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని వివాదాలను శాంతియుతంగా రాజీ చేసుకోవాలని కోరారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ


అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, సెప్టెంబరు 10 : పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విఘ్నేశ్వరుడి విగ్రహం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లు, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

● పట్టణంలోని పోలీసుస్టేషన్‌రోడ్డులో మీడియా మిత్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, జనసేన నేత వెంకటశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిజం గెలిచింది.. నీతి నిలిచింది

● టీడీపీ బాపట్లపార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

బాపట్ల, సెప్టెంబరు 10 : వైసీపీ దుర్మార్గపు పాలనలో నారా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించినప్పటికి విజయం వైపు ప్రజలు నడిపించారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సలగల రాజశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు విషయంలో నిజం గెలిచిందని, నీతి నిలిచిందని స్పష్టం చేశారు. ఏ నేరం చేయకపోయినా దుర్మార్గమైన నిర్ణయం తీసుకొని చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి 52 రోజులు పాటు జైల్లో పెట్టారన్నారు. సిట్ అధికారులు అవినీతిని రుజువు చేయలేక అబాసుపాలయ్యారన్నారు. నియంతపాలనపై ప్రజలు ధ్వజమెత్తి జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారన్నారు. ప్రజలు అపారమైన ప్రేమతో చంద్రబాబును అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్ విషయంలో కూడా గత పాలకులు నిర్లక్ష్యవైఖరి అనుసరించారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విజయవాడకు వరద ముంపు సంభవిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్‌తో ప్రజలకు విశేష సేవలందిస్తూ ప్రజాస్వామ్యానికి పునరంకితమయ్యారని సలగల రాజశేఖర్ పేర్కొన్నారు.

తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ

● సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, సెప్టెంబరు 10 : తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రజ్వలింప చేసిన మహోన్నత సాహితీవేత్త, తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. మంగళవారం విశ్వనాథ సత్యనారాయణజయంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మాల్యాద్రిరావు, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ విశ్వనాథ రచించిన శ్రీమద్రామాయణ కల్పవృక్షం రచనకు తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు లభించింద ని, వెయ్యిపడగలు నవలను విశ్వనాథవారు కేవలం ముప్పై రోజులు రచించిన గొప్ప రచయిత అని పేర్కొన్నారు. అనంతరం పువ్వాడ వెంకటేశ్వరరావు, కె.కాళిదాసు, కస్తూరి శ్రీనివాసరావు తదితర రచయతలు విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

15లోపు పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి


బుద్దాంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వై రామకృష్ణ

కర్లపాలెం, సెప్టెంబరు 10: ముంపునకు గురై పంట నష్టపోయిన రైతులు ఈ నెల 15లోపు పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని బుద్దాంలో ముంపునకు గురైన పొలాలను మంగళవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇప్పటికే పంట నష్టపోయిన రైతు వివరాలను సేకరించిందని వారి జాబితాను సామాజిక తనిఖీ కోసం ఈ నెల 18 వరకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతారని ఎవరి పేరైన రానట్లయితే రైతులు వీఏఏలను సంప్రదించి జాబితాలో నమోదు చేయించుకోవచ్చునన్నారు. వీరి వెంట ఏడీఏ లక్ష్మీ, ఏవో సుమంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు కేంద్ర బృందం సమీక్ష

● హాజరు కానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
● జిల్లా స్థాయిలో అధికారులు హాజరుకావాలి
● బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి


వేమూరులో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో షారోన్

వేమూరు, సెప్టెంబరు 10 : భారీ వర్షాలతో పాటు వరదలకు నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకునేందుకు బుధవారం వేమూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కేంద్ర పరిశీలనా బృందంతో సమీక్ష నిర్వహిస్తారని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రకటించారు. సమీక్ష ఏర్పాటు నిమిత్తంగా మంగళవారం ఆయన వేమూరులో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాధితులకు సాయం అందించేందుకు కేంద్ర పరిశీలన బృందం వేమూరు, రేపల్లె నియోజక వర్గాల పరిధిలో బుధవారం పర్యటించనుందన్నారు. ఈ సందర్భంగా వేమూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 11గంటలకు సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారుల సూచనలతో పాటు జరిగిన నష్టాన్ని పరిశీలన బృందానికి వివరించేందుకు జిల్లాలోని అన్నిశాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. రాష్ట్ర మంత్రులు అనగాని, సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో పాటు ఇతర నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు సమీక్ష సమావేశానికి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మూడు డివిజన్ల ఆర్డీవోలు, రెవెన్యూ, వ్యవసాయశాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, హాజరయ్యారు. వేమూరు తహసీల్దార్ సుశీల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ విస్తృత పర్యటన

కొల్లూరు, రేపల్లె, సెప్టెంబరు 10: వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం బుధ వారం పర్యటించనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, వేమూరు మండలాల్లోని గ్రామాల్లో కలెక్టర్ జె.వెంకటమురళి విస్తృతంగా పర్యటించారు. లంక గ్రామాల్లో వరద వల్ల దెబ్బతిన్న గృహాలు, పంటలను ఆయన పరిశీలించారు. తరచూ ముంపునకు గురవుతున్న సుగ్గునలంక చప్టాను పరిశీలించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. ఈపూరులంకలో వరద నీటిలోనే నిల్వ వుండి కుళ్లిపోతున్న అరటి, పసుపు, బూడిద గుమ్మడి తదితర పంటలను పరిశీలించారు. అరవింద వారధి వద్ద కృష్ణానది నీటి ప్రవాహంతో పాటు సమీపంలోని కృష్ణానది గట్టుకు పడిన గండి ప్రాంతాన్ని పరిశీలించారు. ఆవులవారిపాలెంలో కొల్లూరు రాధాకృష్ణమూర్తికి చెందిన గృహం పూర్తిగా దెబ్బతినడంతో ఆ గృహాన్ని పరిశీలించి సహాయక చర్యలు అందుతాయని హామీ ఇచ్చారు. వరద తాకిడికి బలహీనపడి సీపేజ్ అవుతున్న కరకట్టను ఓలేరు పల్లెపాలెం, ఓలేరు తూర్పుపాలెం, రేపల్లె మండలం రావిఅనంతరం వద్ద పరిశీలించారు. భట్టిప్రోలు మండలం కనగాల ప్రధాన కాల్వ పక్కన ఉన్న వరి పంట పొలాలు ఇప్పటికీ ముంపునకు గురై ఉండటంతో వాటిని కలెక్టర్ పరిశీలించారు. పంటలు సాగు చేస్తూ నష్టపోయిన వారందరిని సర్వేలో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నీట మునిగిన పంటలు, గృహాలు అన్నింటికి నష్ట పరిహారం అందించాలని చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నష్టం అంచనాలు నమోదు చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జేసీ ప్రఖర్‌జైన్, రేపల్లె, చీరాల ఆర్డీవోలు హేలా షారోన్, సూర్యనారాయణరెడ్డి, రేపల్లె తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఆర్‌సీ ఏఈ నాగేశ్వరరావు నాయక్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తాం

● స్వచ్ఛంద సేవలు అభినందనీయం
● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్


లంకేవానిదిబ్బలో వరదబాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్, పంతాని మురళీధరరావు

రేపల్లె, సెప్టెంబరు 10: వరద కారణంగా తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళవారం రేపల్లె మండలం లంకేవానిదిబ్బ గ్రామంలో ఆర్కెస్టు సంస్థ చిలకలూరిపేట ఆధ్వర్యంలో కన్నా ఫౌండేషన్, హైదరాబాద్ శాంతాగౌడ్, రామచంద్రరావు, పూర్ణిమ, రాజు సహకారంతో ఏర్పాటు చేసిన నిత్యావసర వస్తువులను వంట సామగ్రిని, దుస్తులను అనగాని శివప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 600 మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్కెస్టు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ రామారావు, టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, కొపనాతి రాజశేఖర్, తాతా ఏడుకొండలు పాల్గొన్నారు.

● మండలంలోని బొబ్బర్లంకలో వరద ముంపుకు గురై ఇబ్బంది పడుతున్న 72 కుటుంబాలకు విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ గ్రామ పునర్నిర్మాణ సంస్థ(వీఆర్‌వో) సహకారంతో ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, మూడు కేజీల కందిపప్పు, రెండు ప్యాకెట్ల నూనె, రెండు కేజీల పచ్చళ్లు శానిటరీ సామాన్లను డైరెక్టర్ ఫాదర్ వేళంగిణిరాజు, ఫాదర్ ఇమ్మానుయేలు సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుదరల్లి వెంకటేశ్వరరావు, మురళీధరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులు రూ.10వేలు ఆర్థికసాయం

కృష్ణానదికి వరద పోటెత్తటంతో ఎన్నో కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని వారికి అండగా నిలిచేందుకు అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం ముందుకు రావటం అభినందనీయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని అరుణశ్రీ దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు సేకరించిన రూ.10వేల చెక్కును శివప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణ, కృష్ణా మాస్టారు, మధు, పాములు తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి మండలానికి చెందిన మహ్మద్ ఆసిఫ్, ఆలీ కుటుంబం సమకూర్చిన వరద ముంపుకు గురైన రేపల్లె మండలం బొబ్బర్లంక గ్రామంలో 72 కుటుబాలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆసిఫ్, ఆలీ కుటుంబసభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్‌డే వేడుకలు



ఇంజనీరింగ్‌డే వేడుకల్లో ముఖ్యఅతిథిని సన్మానిస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 10: బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని మంగళవారం 57వ ఇంజనీర్స్ డే వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ ఎస్ఎల్‌సీ ఇండియన్ లిమిటెడ్ మోటుపల్లి ప్రసన్నకుమార్ పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతికరంగంలో రాణించాలంటే ఆత్మవిశ్వాసం, అవిశ్రాంత పరిశ్రమతో కష్టపడి చదువుకోవాలన్నారు. నేటి యువతరం పరిశోధన రంగం వైపు ప్రయాణించి దేశం గర్వపడేలా సమాజ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. కళాశాలలో తనకున్న అనుభవాన్ని నెమరవేసుకుంటూ మెకానికల్ ఇంజనీరింగ్‌ను 1983 బ్యాచ్‌లో చదువుకున్నానని ఈ కళాశాలలో ఎందరో గురువులు తనకు స్ఫూర్తిని నింపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మోటుపల్లి ప్రసన్నకుమార్ లాంటి ఉన్నతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని మంచి స్ఫూర్తిని పొందాలన్నారు. విద్యాప్రదాత బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ముప్పలనేని శేషగిరిరావు ఆశయ లక్ష్యసాధన మేరకు ప్రతి విద్యార్థికి సృజనాత్మకత, అంకితభావం, పట్టుదల, లక్ష్యసాధనలో ముందుకు సాగిపోవాలని తెలిపారు. మోటుపల్లి ప్రసన్నకుమార్ దంపతులను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌లు డి.రామ్మోహనరావు, జి.దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కె.హరిపద్మప్రసాద్, కోశాధికారి టి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ షేక్.నజీర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చే వరకు ఉద్యమిస్తాం

● ఏఐటీయూసీ నాయకులు


పాతబస్టాండ్‌లో రాస్తారోకో చేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

బాపట్ల, సెప్టెంబరు 10 : విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగించే వరకు ఉద్యమాలు ఆగవని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో రాస్తారోకో చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఫ్యాక్టరీని నేడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించాలనే దృష్ట ఆలోచన చేస్తుందన్నారు. ఈ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే కరీముల్లా, బత్తుల అశోక్, ఎస్‌కే జిలానీ, ఆటో యూనియన్ నాయకులు ఎస్‌కే షబ్బీర్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. బాపట్ల పాత బస్టాండ్ కూడలిలో మంగళవారం విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మజుందార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడపటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు హామీనిచ్చిందని, గడిచిన మూడు నెలలుగా రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి దీని రక్షణకు ఎటువంటి ప్రకటన చేయలేకపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, బుచ్చిరాజు, బ్రహ్మం, బాషా, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

కొల్లూరు, సెప్టెంబరు 10 : వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలన చేసింది. మంగళవారం చినపులివర్రు, గురివిందపల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికీ నీటిలోనే ఉన్న వరి పొలాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఎ.మృదుల, ఎం ఉషా, ఎం.కామాక్షి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, పొలాల్లో నీరు బయటకు వెళ్లిన అనంతరం ఎకరాకు 20 కిలోల పోటాష్, 200 గ్రాముల కార్బనైజమ్ పంటలో పిచికారీ చేసుకోవాలన్నారు. పంటను సంరక్షించుకునేందుకు తగిన సలహాలు, సూచనలు చేశారు.

పంటలను కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● లంక గ్రామాల్లో వాణిజ్య పంటలు పరిశీలించిన సీపీఐ నాయకులు


దెబ్బతిన్న వాణిజ్య పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 10 : కృష్ణానది వరదల వల్ల వాణిజ్య పంటలు కోల్పోయిన లంక గ్రామాల రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు కోరారు. మంగళవారం మండల పరిధిలోని చింతమోటు, పెదపులివర్రు గ్రామాల్లో వరద ముంపునకు గురై దెబ్బతిన్న పంటలను సీపీఐ నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నాగాంజనేయులు జిల్లా కమిటీ సభ్యులు బాలాజీలు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే తరుణంలో వరద ధాటికి తుడుచుకుపెట్టుకుపోయాయన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సహాయ కార్యక్రమాలు అభినందనీయమని, అలాగే పంటలు నష్టపోయిన రైతులకు కూడా గ్రామాన్ని యూనిట్‌గా చేసుకుని పంటల బీమా పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఎఐటియుసి నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు, కొనరాజు సతీష్, కొమ్మినేని శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతికి ప్రత్యేక పూజలు


జనార్దనస్వామి దేవాలయంలో పూజలు అందుకుంటున్న మట్టి గణపతి

కర్లపాలెం, సెప్టెంబరు 10 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని అగ్రహారంలో ఉన్న జనార్దనస్వామి ఆలయంలో అగ్రహారం ప్రజలు 5 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా భక్తులు మట్టి గణపతికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలో 5 అడుగుల మట్టి గణపతి విగ్రహం అగ్రహారంలో ఒక చోట మాత్రమే ఏర్పాటు చేసి ఉండటంతో మండల నలుమూలల నుంచి మట్టి గణపతి వద్దకు విచ్చేసి భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

వరద బాధితులందరినీ ఆదుకుంటాం

హార్వెస్ట్ ఇండియా సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే ఆనందబాబు


హార్వెస్ట్ ఇండియా అందించిన నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జడ్పీ చైర్‌పర్సన్ కిష్టినా

కొల్లూరు, సెప్టెంబరు 10: వరద బాధితులందరిని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం కొల్లూరు మండలపరిధిలోని చింతల్లంక, పెదలంక గ్రామాల్లోని బాధితులకు హార్వెస్ట్ ఇండియా అందించిన నిత్యావసరాలను జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాలతో కలిసి ఎమ్మెల్యే ఆనందబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానది చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో భారీ వరద పోటెత్తి లంక గ్రామాల్లోని ప్రజలు, రైతుల పంటలు, ఇళ్లు, సామగ్రిని కోల్పోయారని, వరదకు ముందు భారీ వర్షం కురవడంతో విజయవాడ నగరాన్ని కూడా వరదలు చుట్టుముట్టాయని, అక్కడ ముఖ్యమంత్రి పది రోజులుగా వరదల్లో చిక్కుకుపోయిన వారికి దగ్గరుండి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని, ఆయన స్ఫూర్తితో ఇక్కడ కూడా తాము కూడా పని చేస్తూ ప్రజలను అన్ని విధాలా సేవలు అందే విధంగా కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో వర్షాలు, వరదల వల్ల ఒక్క రైతుకి కూడా అన్యాయం జరగకుండా ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. హార్వెస్ట్ ఇండియా సంస్థ స్వచ్ఛందంగా లంక గ్రామాల్లో నిర్వాసితులకు నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమన్నారు. లంక గ్రామాల్లో పంటలు దెబ్బతిన్న గృహాలను పరిశీలించి వస్తున్న కలెక్టర్ నిత్యావసర పంపిణీ కార్యక్రమం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే ఆనందబాబుకు జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా కూడా వరద బాధితులకు నిత్యావసరాలను హార్వెస్ట్ ఇండియా ప్రతినిధులు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా సంస్థ చైర్మన్ కత్తెర సురేష్‌కుమార్, ఎమ్మెల్యే తనయుడు నక్కా అఖిలేష్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, కోగంటి శివవెంకటేశ్వరరావు, యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రామమోహనబాబు, కోగంటి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో కూరగాయల పంపిణీ


లంక గ్రామాల్లో కూరగాయలు పంపిణీ చేస్తున్న ప్యాపర్రు గ్రామ టీడీపీ శ్రేణులు

కొల్లూరు, సెప్టెంబరు 10: లంక గ్రామాల్లోని వరద బాధితులకు టీడీపీ నాయకులు కూరగాయలు పంపిణీ చేశారు. మంగళవారం అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన పేరు మీద మండలపరిధిలోని తోకలవానిపాలెం, కృష్ణనగర్‌లోని వరద బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు.

వరద బాధితులకు శంభో యోగ సాధకుల సాయం


పెసర్లంక పల్లెపాలెంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, వంటసామగ్రి, దుస్తులను అందిస్తున్న శంభో యోగా ఫౌండేషన్ సభ్యులు

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 10 : వరద బాధితులకు శంభో యోగ సాధకులు సహాయం అందజేశారు. మంగళవారం మండలపరిధిలోని పెసర్లంక, పల్లెపాలెం వరద బాధితులకు దుప్పట్లు, చీరలు, వంట సామగ్రి తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, పద్మ, నిర్మల, సునీత, ఝాన్సీ, లక్ష్మీ, ఊర్మిళ, శోభ, శ్రీకాంత్ గురూజీ ఆధ్వర్యంలో అందజేశారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆనందబాబు జన్మదిన వేడుకలు


చంపాడులో ఆనందబాబు బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, సెప్టెంబరు 10: వేమూరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు జన్మదిన వేడుకలను మంగళవారం మండలపరిధి గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు ఘనంగా నిర్వహించారు. చంపాడులో పీకా రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు హాజరై కేక్ కట్ చేశారు. బలిజేపల్లిలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్స్‌తో పాటు పండ్లు పంపిణీ చేశారు. కుచ్చెళ్ళపాడులో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అనురాధ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్, జామెంట్రీ బాక్సులు, పెన్నులు పంపిణీ చేశారు. గ్రామాల్లోని టీడీపీ, జనసేన శ్రేణులు అనేక కార్యక్రమాలు నిర్వహించి ఆనందబాబుకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.

బాధితులకు ట్రూత్ మినిస్ట్రీస్ సహకారం



బాధితులకు నిత్యావసర పంపిణీ వాహనాన్ని తరలిస్తున్న ట్రూత్ మినిస్ట్రీస్ సభ్యులు

వేమూరు, సెప్టెంబరు 10 : విజయవాడ పట్టణంలోని వరద బాధితులను ఆదుకునేందుకు మండలంలోని బూతుమల్లి గ్రామానికి చెందిన ట్రూత్ మినిస్ట్రీస్ ముందుకు వచ్చింది. మినిస్ట్రీస్ పీఈ ప్రియాంక ఆధ్వర్యంలో మంగళవారం వరద బాధితులకు మంచినీరు, ఆహార పొట్లాలు, కూరగాయలు, గ్రుడ్లు, అందించేందుకు వాహనాలను విజయవాడకు పంపారు. 2వేల కుటుంబాలకు సరఫరా చేస్తున్నట్లు ప్రియాంక తెలిపారు. సంస్థ ప్రతినిధి పాలపర్తి ఐజాక్ మాట్లాడుతూ సంస్థ ద్వారా ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో భాంగా వరద బాధితులను ఆదుకుంటామని అన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 10: మండలంలోని పోతనకట్టవారిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో- 1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యనభ్యసించే విద్యార్థుల నెలవారి సిలబస్ గురించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.దుర్గారావు, కె.రజనీ, ఉపాధ్యాయులు, ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 10 : వరద ప్రభావిత గ్రామాల్లో విద్యార్థులకు సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం తరఫున పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ బ్యాగ్‌లు, తదితర వాటిని అందజేశారు. కార్యక్రమంలో జాకబ్, శివరామకృష్ణ, కుటుంబరావు, ఏస్టేట్‌బాబు, వెంకటేశ్వరరావు, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజల సహకారంతోనే అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- తవ్వకాలను పరిశీలించిన అధికారులు
- కలెక్టర్‌కు పంపేందుకు నివేదిక సిద్ధం

చీరాలటౌన్, సెప్టెంబరు 10: ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు స్థానికులు చైతన్యవంతులు కావాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు. చీరాల నియోజకవర్గ పరిధిలోని వాడరేవు, బుర్లవారిపాలెం ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇసుక రవాణాపై సచివాలయాల సిబ్బందితో అంచనా వేశారు. తవ్వకాలు జరిగిన ప్రదేశాలు ప్రైవేటు స్థలాలా లేక ప్రభుత్వ స్థలాల వంటి విషయాలపై నివేదికను సిద్ధం చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని రైతులతో మాట్లాడారు. ఇసుక రవాణా జరిగే సమయంలో విషయాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. కొల్లూరు వంటి ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక వ్యాపారాలు జరగడం వలనే నీళ్లు నిలిచి నివాసాల్లోకి నీరు చేరినట్లు వివరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఇసుక రవాణాపై డీఎస్పీ జగదీష్, తహసీల్దార్‌తో సమావేశం నిర్వహించారు.

డిప్యూటీ ఈవోగా శ్రీనివాసరావు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబరు 10 : చీరాల డివిజన్ డిప్యూటీ డీఈవోగా అబ్బరాజు శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా శాతం సంఖ్య పెంచాలని ఆయన సూచించారు. డ్రాప్ అవుట్స్‌ను, ఓపెన్ టెన్త్, ఇంటర్ పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కారంచేడు ఎంఈవో మొలబంటి వెంకటేశ్వర్లు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌టీల నియామకాల్లో అక్రమాలపై విచారణ

- పూర్వ డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్ హాజరు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 10 : వైద్యారోగ్యశాఖలో తప్పుడు సర్టిఫికెట్లతో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ నియామకాలపై వచ్చిన ఫిర్యాదులపై ఏపీ శాక్స్ అడిషనల్ డైరెక్టర్ సరస్వతి విచారణ చేపట్టారు. పూర్వపు డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మి, అప్పటి సూపరింటెండెంట్ పయ్యావుల శ్రీనివాసరావుతో పాటు ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు (ఎల్‌టీ), ఉద్యోగం నుంచి తొలగించిన ఒక ఎల్‌టీ హాజరయ్యారు. నియామకాలకు సంబంధించి పలు ఫైళ్లను సరస్వతి పరిశీలించినట్లు తెలిసింది.

బైకు అదుపుతప్పి యువకుడు దుర్మరణం

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 10: ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మద్దిరాలపాడులోని శ్రీజి కళాశాల వద్ద గల రహదారిపై జరిగింది. ఒంగోలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగులుప్పలపాడు మండలం టి.అగ్రహారం గ్రామంలోని దళితకాలనీకి చెందిన పులగర తరుణ్ (21), మర్రిపూడి ప్రమోద్ ఇరువురు స్నేహితులు. వారు బేల్దారి పనులకు వెళుతుంటారు. ఈక్రమంలో గ్రామంలో జరగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి బాణసంచా కొనుగోలు చేసేందుకు మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై ఒంగోలు వచ్చారు. వాటిని తీసుకుని తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మద్దిరాలపాడు శ్రీజి కళాశాల వద్దకు రాగా యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని వారు కిందపడ్డారు. దీంతో తరుణ్ తలపగిలి తీవ్రగాయాలు కాగా, ప్రమోద్ కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికుల సమాచారం మేరకు 108వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా తరుణ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందటంతో రిమ్స్ వద్ద తరుణ్ కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్రహారం టీడీపీ నాయకులు పొద శ్రీధర్ రిమ్స్ వదకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏకేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్‌గా హర్షప్రీతమ్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్‌గా సోషల్ వర్క్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ బి.హరిబాబు మంగళవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. గత ఏడాదిగా ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్‌గా, యూనివర్శిటీ అభివృద్ధి కోసం చేసిన సేవలను పరిగణలోకి తీసుకొని మరలా తనను నియమించడం ఆనందంగా ఉందని హర్షప్రీతమ్ పేర్కొన్నారు. వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు సూచనలకు అనుగుణంగా యూనివర్శిటీకి మంచి పేరుప్రతిష్టలు తీసుకువస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, వైస్‌ప్రిన్సిపాల్ నిర్మలామణి, జి.సోమశేఖర్, పిల్లి వెంకటరావు, ఆర్.శ్రీనివాస్ అభినందించారు.

ఓపెన్ స్కూల్స్‌కు 15లోపు అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 10: ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియేట్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 15లోపు అడ్మిషన్లు పొందవచ్చని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 25వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. జిల్లాలోని కోఆర్డినేటర్లు ఓపెన్‌స్కూలులో చేరేలా విద్యార్థులకు ఈ విషయం తెలియజేయాలన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కనీసం పదిశాతం అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన గుజరాత్ బృందం

ఒంగోలు నగరం, సెప్టెంబరు 10: గుజరాత్ నుంచి వచ్చిన అధికారుల బృందం రెండో రోజు కూడా కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. మంగళవారం ఈ బృందం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పలురకాల పంటలను పరిశీలించి రైతుల అనుభవాలను తెలుసుకుంది. కొత్తపట్నంలో ప్రకృతి వ్యవసాయం కింద సాగులో ఉన్న వేరుశనగ పంటను పరిశీలించి అధికంగా దిగుబడి రావటానికి గల కారణాలను పురిణి మల్లీశ్వరమ్మను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. 30 రకాల విత్తనా లతో సాగు చేస్తున్న ప్రీమూన్ డ్రైసోయింగ్ విధానాన్నికూడా పరిశీలించారు. అలాగే ఈతముక్కల గ్రామంలో కూడా పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం విభాగం పీడీ సుభాషిణి, డీడీ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖాధికారి హుమాయున్ పాల్గొన్నారు.

దేశ రక్షణకు సైనికుల త్యాగాలు మరువలేనివి

కనిగిరి, సెప్టెంబరు 10: దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు మరువలేనివని పలువురు కొనియాడారు. టెరిటోరియల్ ఆర్మీ ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాశ్మీరు నుంచి సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. కాశ్మీర్‌లోని సియాచిన్ నుంచి అండమాన్ నికోబార్ దీవుల్లోని ఇందిరా పాయింట్ వరకు చేపడుతున్న సైకిల్ యాత్ర సోమవారం రాత్రి కనిగిరిలో అమరావతి గ్రౌండ్స్‌కు చేరింది. అక్కడ బస ఏర్పాటుచేశారు. మంగళవారం అమరావతి గ్రౌండ్స్ వద్ద సీఐ ఖాజావలి ర్యాలీని ప్రారంభించారు. ఆర్మీ జవాన్లు, మేజర్లు, స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని పట్టణంలో భారీ జాతీయ జెండాతో సైకిల్ యాత్ర చేపట్టారు. దేశవ్యా ప్తంగా జరిగే ఆర్మీ వసంతోత్సవాలు కనిగిరిలో జరిగిన కార్యక్రమం ప్రత్యేకతను చాటింది. కూటమి శ్రేణులు కూడా సైకిల్ యాత్రలో పాల్గొని తమ దేశభక్తిని చాటుకున్నారు. అమరావతి గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రభుత్వ హైస్కూల్ వద్దకు రావటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు ఎన్‌సీసీ దుస్తులు ధరించి ఆర్మీ జవాన్లు, మేజర్లతో కలసి నగరంలో ర్యాలీలో పాల్గొన్నారు. దాదాపు 400 వందల అడుగుల జాతీయ జెండాను చేతభూని విద్యార్థులు ర్యాలీలో పాల్గొనటం విశేషంగా నిలిచింది. ఈసందర్భంగా జవాన్లు మాట్లాడుతూ దేశభద్రత లక్ష్యంగా ఆర్మీ కృషి చేస్తుందని చెప్పారు. దాదాపు 5వేల 500 కిలోమీ టర్లు సైకిల్‌యాత్ర చేపట్టేందుకు లక్ష్యం కాగా, 3వేల 269 కిలో మీటర్లు పూర్తి చేసుకుని కనిగిరికి చేరుకున్నట్లు ఆర్మీ బృందం తెలిపారు. కార్యక్రమంలో ఆర్మీ మేజర్లు, సిపాయిలు, సీఐ ఖాజావలి, ఎస్ఐ త్యాగరాజు పాల్గొన్నారు.

టోల్ రుసుం ఎందుకోసం?

- నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు
- గతంలో ఎంత జమ చేశారు
- ప్రస్తుతం ఏం చేస్తున్నారు



కీర్తివారిపాలెంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్ ఆఫీస్

చీరాల, సెప్టెంబరు 10 : వాడరేవు పంచాయతీ పరిధిలోని కీర్తివారిపాలెంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాడరేవు తీరప్రాతంతోపాటు పర్యాటక ప్రదేశం కూడా. రోజు వందల సంఖ్యలో పర్యాటకులు వివిధ వాహనాల్లో ఇక్కడకు వస్తుంటారు. ఈ క్రమంలో పంచాయతీ అభివృద్ధికి, తీరప్రాంత శుభ్రతకు నిధులు సమకూర్చుకునేందుకు ఇక్కడ టోల్‌గేట్‌ను ఏర్పాటు చేశామని, అందుకు డీపీవో రవికుమార్ అనుమతి ఇచ్చారని చెప్తున్నారు. అయితే దీని నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంపై చార్ అణా కోడికి బార్ అణా మసాలాలా టోల్ నిర్వహణ తీరు ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

గతంలో ఏం జరిగింది.. ఇప్పుడేం జరుగుతోంది

వాడరేవు పంచాయతీ పరిధిలోని కీర్తివారిపాలెం, వేటపాలెం మండలం అక్కాయిపాలెం పంచాయతీ రామాపురంలో గతంలో టోల్‌గేట్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో నిధుల వసూళ్లు, వినియోగంపై ఆరోపణలు వచ్చాయి. పర్యాటకుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఆ తరువాత జరిగిన పరిణామాల క్రమంలో టోల్‌గేట్‌లను తొలగించారు. తాజాగా మళ్లీ టోల్‌గేట్లను ఏర్పాటు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందునా ఎమ్మెల్యే కొండయ్య కీర్తివారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను ప్రారంభించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పొంతనలేని నిర్వహణ తీరు తీరు



టోల్ రుసుం రసీదు

పంచాయతీకి నిధుల కొరత వెంటాడుతోంది. ఈ క్రమంలో టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసి వాహనాల నుంచి నిర్ణీత రుసుము వసూలు చేసి గ్రామాభివృద్ధికి, తీరప్రాంత పరిశుభ్రతకు ఖర్చు చేస్తారని, అందుకోసం పంచాయతీ తీర్మానం ద్వారా పార్కింగ్ ఫీజు వసూలుకు అనుమతి ఇచ్చారని అధికారులు చెప్తున్నారు. పార్కింగ్ రుసుము అంటే తీరంలోని నిర్ణీత ప్రదేశాలలో పార్కింగ్ వసరు చూపాలి. కానీ కీర్తివారిపాలెంలో వసూళ్లు ఎందుకనేది సమాధానంలేని ప్రశ్న. టోల్ ఫీజు వసూలుకు ముగ్గురు ప్రైవేటు వ్యక్తులను నియమించారు. వారికి నెలకు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున జీతం చెల్లించినా రూ.30వేలు అవుతుంది. పంచాయతీ సిబ్బందితో ఆ పనిచేయిస్తే ఆ నిధులు మిగులుతాయి. ఆపని ఎందుకు చేయడం లేదో అనుమతులు ఇచ్చిన అధికారులకే తెలియాలి.

వ్యాపార వాహనాలకు మినహాయింపై విమర్శలు

వాడరేవుకు రొయ్యల లోడ్‌తో ప్రతి రోజు కొన్ని వాహనాలు వస్తుంటాయి. వాటికి ఎలాంటి రుసుము చెల్లించే పనిలేకుండా మినహాయింపు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా వాటి నుంచే ఎక్కువ రుసుము వసూలు చేయాల్సి ఉండగా వాటిని విడిచి, సముద్రస్నానాలకు వచ్చే భక్తులు, పర్యాటకుల వాహనాల నుంచి టోల్ వసూలు చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇది సరైన పద్ధతి కాదు

రోడ్డు అభివృద్ధి కోసమైతే వాహనాల వద్ద టోల్ రుసుము వసూలు చేస్తారు. ఇక్కడ చెప్పే కారణాలు సహేతుకంగా లేవు. మాకున్న వ్యాపార పనులపై రోజు వస్తుంటాం. ప్రతి రోజు రూ.50 చెల్లించమంటే సరి కాదు. ఇది సరైన పద్ధతికాదు.

- పి.వెంకట్రావు, నాగులుప్పలపాడు, ప్రకాశం జిల్లా

గాడినపడని పోలీస్!

- పూర్తికాని బదిలీల పర్వం
- డీఎస్పీలు, సీఐల విషయంలో అధిష్ఠానం, ఎమ్మెల్యేలకు మధ్య కుదరని ఏకాభిప్రాయం
- ఎస్సైలకు స్థానచలనంలోనూ అదేతంతు
- కొందరు బదిలీ విషయంలో ఎమ్మెల్యేల అసంతృప్తి
- పోలీసుల నిర్లక్ష్యానికి దేకనకొండ ఘటన నిదర్శనం

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చి మూడు నెలలవుతోంది. జిల్లాకు కొత్త పోలీసు బాస్ వచ్చి రెండు నెలలవుతోంది. అయినా పోలీసు శాఖలో బదిలీల తంతు పూర్తి కాలేదు. డీఎస్పీలు, సీఐల నియామకం విషయంలో అధిష్ఠానం, ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం అందుకు కారణమైంది. ఎస్సైల బదిలీల విషయంలోనూ కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఇక ఎస్పీకి తన చుట్టూ ఉన్న పరివారం తప్పుడు సమాచారం ఇస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల పోలీసులు పంచాయితీలకు తెరలేపడం, దేకనకొండలో ఇరువర్గాలు ఘర్షణ పడితే ప్రేక్షక పాత్ర వహించడం ఆ శాఖ పనితీరు గాడిలో పడలేదన్నదానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లా పోలీసు కార్యాలయం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలీసు అధికారుల బదిలీల విషయంలో అనేక రకాల ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. గత వైసీపీ పాలనలో గాడి తప్పిన పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. తదనుగుణంగా పోలీసు అధికారుల బదిలీల్లో కూటమి ప్రభుత్వ పెద్దలు వ్యవహరించిన విధానం ఆ పార్టీ అధినాయకులకు, ఎమ్మెల్యేలకు మధ్య అగాధాన్ని సృష్టించింది. తొలుత డీఎస్పీలను తామే పంపుతామని ప్రకటించారు. క్రమేపీ స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్నారు. అయితే గత ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిన బాధిత డీఎస్పీలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయినా ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ ఇద్దరు డీఎస్పీలను మాత్రమే కొత్తగా నియమించారు.

మార్కాపురం, కనిగిరి, చీరాల డీఎస్పీల విషయంలో మీనవేషాలు లెక్కిస్తున్నారు. ఆగస్టులో రిటైర్ అవుతున్న కనిగిరి డీఎస్పీని అప్పటి వరకూ కొనసాగించాలని తొలుత కనిగిరి ఎమ్మెల్యే కోరారు. ఆతర్వాత ఆయనతో పాటు కొండపికి సంబంధించిన యువనాయకుడు సత్య డీఎస్పీగా అశోక్‌వర్ధన్ కావాలని కోరారు. కుదరదని అధిష్ఠానం వారి ప్రతిపాదనను తోసిపుచ్చింది. ఆతర్వాత శ్రీనివాసరెడ్డి అనే డీఎస్పీ పేరును ప్రతిపాదించారు. ఆయన ఏఎస్పీ ప్రమోషన్‌లో ఉన్నందున వీలుకాదన్నారు. ప్రస్తుత డీఎస్పీ రిటైర్ అయినా ఇంతవరకూ కొత్త వారిని నియమించలేదు. మార్కాపురానికి గతంలో ఒంగోలు డీఎస్పీగా చేసిన కిశోర్‌ను నియమించాలని మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో కీలక బాధ్యతల్లో ఉన్న నాయకులు సిఫార్సు లేఖ పంపమనడంతో వారు పంపారు. కానీ ఇంత వరకూ ఆ డీఎస్పీ నియామకం విషయంలో కూడా స్పష్టత రాలేదు. చీరాల డీఎస్పీ విషయంలో ఇలాంటి తంతే సాగుతోంది.

ఎమ్మెల్యేల ప్రతిపాదనకు లభించని ప్రాధాన్యం

సీఐలకు సంబంధించి ఎమ్మెల్యేలు సూచించిన వారిలో చాలామందిని కాదని అధిష్ఠానం వేరే వారిని నియమించింది. అధిష్ఠానంలో పలుకుబడి ఉన్న హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ స్థాయి నాయకులు సిఫార్సు చేస్తే వైసీపీ ప్రభుత్వంలో రాజ్యమేలిన వారికి మంచి పోస్టులు దొరుకుతా యనేందుకు చీమకుర్తి సీఐ విషయం ఒక దర్పణం. కొందరు ఎమ్మెల్యేలకు వారు కోరుకున్న సీఐలను కాకుండా వేరే వారిని ఎంపిక చేసి పంపారు. అందులో వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు మంచి పోస్టుల్లో పనిచేసిన ఒకరిద్దరు ఉన్నారు. ఇప్పటికీ త్రిపురాంతకం, కంభంతో పాటు చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో కొన్ని సర్కిళ్లకు ఇన్‌స్పెక్టర్‌లను నియమించాల్సి ఉంది.

ఎస్సైల విషయంలో ఎస్పీపై ఎమ్మెల్యేల గుర్రు

ఎస్సైల బదిలీల విషయంలో ఎస్పీ దామోదర్‌పై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఇంకా పదికి పైగా స్టేషన్‌లలో ఎస్సైల బదిలీలు జరగాల్సి ఉంది. ఈ విషయంలో ఎస్పీకి, సంబంధిత ఎమ్మెల్యేల మధ్య అంతర్గత వార్ నడుస్తోంది. మార్కాపురం నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో కూడా పూర్తిగా అప్పటి వైసీపీ అభ్యర్థులకు అనుగుణంగా వ్యవ హరించారనే ఒక ఎస్ఐపై విమర్శలు ఉన్నాయి. అతని పనితీరుపై ఇద్దరు ఎమ్మెల్యేలు ఒక ఎంపీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్కడ కొత్తగా ఎవరిని నియమించాలో మార్కాపురం ఎమ్మెల్యే ఎస్పీకి సూచించారు. కొత్తగా నియమించాల్సిన ఎస్సై విషయంలో సమస్యలు ఉన్నా పాత ఎస్సైని వీఆర్‌కు పంపాల్సిన బాధ్యత అయితే ఉంది. కానీ ఎస్పీ అలాంటి నిర్ణయం తీసుకోలేదు.

మరో నియోజకవర్గంలో ఎస్సైల బదిలీల విషయంలో ఎమ్మెల్యే ఎంత మొత్తుకున్నా ఎస్పీ దామోదర్ నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కొన్ని నియోజకవర్గాల్లో ఎస్సైల బదిలీలపై వేగంగా స్పందించిన ఎస్పీ తమ నియోజకవర్గం విషయంలో మాత్రమే మీనమేషాలు లెక్కిస్తున్నారని ఎమ్మెల్యేలు మదనపడు తున్నారు.

పోలీసు బాస్‌కు తప్పుడు సమాచారం

జిల్లాలో ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ తదితర విభాగాల్లో తిష్టవేసి కూర్చున్న కొందరు పోలీసు అధికారులు ఎస్పీకి తప్పుడు సమాచారం ఇవ్వడమే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక ఎమ్మెల్యే అయితే తన నియోజకవర్గంలో ఒక ఎస్సై పోస్టు విషయంలో ఎస్పీని ఎస్‌బీ అధికారులు తప్పుదారి పట్టించారని బలంగా నమ్ముతున్నారు. అంతెందుకు పోలీసు శాఖలో పనిచేసే వారిలోనూ అలాంటి అనుమానాలు ఉన్నాయి.

కొన్ని స్టేషన్‌లలో పెత్తనం చేసే సీనియర్ కానిస్టేబుళ్ల మార్పులకు కూడా ఎస్పీ నుంచి సహకారం లభించడం లేదన్న ఆవేదనను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు.

దేకనకొండ ఘటన ఒక నిదర్శనం

పోలీసు శాఖ గాడిలో పడలేదనేందుకు కురిచేడు మండలం దేకనకొండలో రెండు ప్రధాన పార్టీల మధ్య ఘర్షణను నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఆ గ్రామంలో సోమవారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీ, వైసీపీ వర్గీయులు రాళ్లు రువ్వుకున్నారు. వైసీపీ వర్గీయులు ముందస్తు ప్రణాళికతో దాడికి దిగారనేది జగమెరిగిన సత్యం. ఆతర్వాత పోలీసుల రంగ ప్రవేశం చేశారు. గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు.

అయినప్పటికీ మంగళవారం ఉదయం పోలీసు సమక్షంలో అక్కడ మరోసారి ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఇది పోలీసుల నిర్లక్ష్యాన్ని, వైఫల్యాన్ని తేటతెల్లం చేస్తోంది. అందులోనూ వైసీపీ వర్గీయులు దాడికి తెగబడటం రాజకీయంగా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కొన్ని పోలీసు స్టేషన్‌లలో పంచాయితీల పర్వానికి అధికారులు తెరతీశారు.

పెండింగ్ లేకుండా రుణాలు ఇవ్వాలి

- నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి
- బ్యాంకర్లకు కలెక్టర్ అన్సారియా సూచన

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 10 : ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ, ఇతరత్రా రుణాలను పెండింగ్ లేకుండా వేగవంతంగా మంజూరు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో మంగళవారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం (డీఎల్ఆర్‌సీ) కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 2024-25లో వార్షిక రుణ లక్ష్యం రూ.20,591.18కోట్లు నిర్దేశించగా జూన్ 30 నాటికి 60.73శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. అందుకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పెండింగ్ లేకుండా రుణం ఇవ్వాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీసీఆర్‌సీ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరూ పంట, పశు రుణాలకు అర్హులన్నారు. వారికి రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రమేష్, వివిధ శాఖల అధికారులు వసుంధర, శ్రీనివాసరావు, డాక్టర్ బేబీరాణి, జనార్దన్‌రెడ్డి, గోపీచంద్, శ్రీనివాసప్రసాద్, రమణ, జగన్నాధరావు, ఉదయకుమార్ పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కుంభకోణంలో బాధ్యులపై చర్యలకు ఆమోదం

మహాజనసభలో తీర్మానం

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 10 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో చోటుచేసుకున్న కుంభకోణంలో బాధ్యులైన ముగ్గురిపై చర్యలు తీసుకొనేందుకు మహాజన సభ ఆమోదం తెలిపింది. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అయిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అధ్యక్షతన ఇటీవల జరిగిన మహాజనసభలో ఈమేరకు తీర్మానం చేశారు. డీసీఎంఎస్‌లో రూ.3.5 కోట్ల మేర కుంభకోణం చోటుచేసుకున్న విషయం విదితమే. దీనిపై సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాలకొండయ్య విచారణ చేపట్టారు. సొసైటీ నుంచి ఇండియన్ పొటాష్ లిమిటెడ్(ఐపీఎల్) కంపెనీకి చెల్లించాల్సిన రైతుల ఎరువుల సొమ్ము రూ.3.50 కోట్లను అకౌంటెంట్ బొమ్మరాజు రామచంద్రరావు తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు మళ్లించి దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించారు.

అనంతరం ఐపీఎల్, సహకార శాఖ అధికారుల ఒత్తిడి మేరకు ఈమొత్తంలో రూ.3కోట్లు తిరిగి ఐపీఎల్ ఖాతాకు జమ చేశారు. ఇంకా రూ.52లక్షలు బకాయి ఉంది. ఈ కుంభకోణంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్ చుండూరి సతీష్, అకౌంటెంట్ రామచంద్రరావులను నిందితులుగా విచారణాధికారి గుర్తించారు. చైర్‌పర్సన్, బిజినెస్ మేనేజర్లు ముందుగానే సంతకాలు పెట్టిన చెక్కులు అకౌంటెంట్‌కు ఇచ్చినందునే ఈ వ్యవహారం జరిగినట్లు విచారణాధికారి తేల్చారు. దుర్వినియోగమైన రూ.52 లక్షలను చైర్‌పర్సన్, బిజినెస్ మేనేజర్, అకౌంటెంట్‌ల నుంచి వసూలు చేయాలని సిఫార్సు చేశారు. వారిపై సివిల్, క్రిమినల్, క్రమశిక్షణ చర్యలు తీసుకొనేందుకు కలెక్టర్ ఆమోదం తెలపాల్సి ఉంది. అందుకోసం డీసీవో శ్రీనివాసరెడ్డి ఫైల్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం.

కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లకు ముహూర్తం ఖరారు

- వచ్చేనెల 7నుంచి అక్కడ వేలం ప్రారంభం
- గతం కన్నా భారీగా పెరగనున్న ఉత్పత్తి
- రానున్న సీజన్‌లో ఆంధ్ర మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం

ఒంగోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లకు ముహూర్తం ఖరారైంది. వచ్చేనెల 7నుంచి అక్కడి వేలం కేంద్రాలు తెరుచుకోనున్నాయి. ఆ రాష్ట్రంలో ఉన్న పది కేంద్రాలలో ఒకే రోజు కొనుగోళ్లను ప్రారంభించనున్నారు. ఆమేరకు బోర్డు కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఆంధ్ర ప్రాంతంలో ప్రస్తుతం కొనసాగుతున్న వేలం ఈ నెలాఖరుకు ముగిసే అవకాశం ఉండటంతో ఈమేరకు నిర్ణయించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా గత రెండేళ్ల కన్నా ఈ ఏడాది కర్ణాటకలో పంట ఉత్పత్తి భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. ఆ రాష్ట్రంలో 2022-23 సంవత్సరానికి 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతించగా కేవలం 60 మిలియన్ కిలోలు మాత్రమే పండింది.

అలాగే గత ఏడాది (2023-24)లో కూడా 100 మిలియన్ కిలోలకు అనుమతివ్వగా 83 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగింది. గత ఏడాది అక్కడ కిలో గరిష్ఠ ధర రూ.289 పలుకగా సగటున రూ.254 లభించింది. ఆ రెండేళ్లు కర్ణాటకలో పంట ఉత్పత్తి తగ్గడం, ఆంధ్ర ప్రాంత రైతులకు ఉపకరించి మంచి ధరలు లభించాయి. కాగా ఈ ఏడాది (2024-25) కర్ణాటకలో తిరిగి వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా సుమారు 105 మిలియన్ కిలోల వరకూ వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా. అంటే గత ఏడాది కన్నా సుమారు 33 మిలియన్ కిలోలు, అంతకుముందు ఏడాది కన్నా 45 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి అవుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో వచ్చేనెల 7నుంచి అక్కడ కొనుగోళ్లను పొగాకు బోర్డు చేపట్టనుంది. పెరిగిన పంట ఉత్పత్తితో కర్ణాటకలో ధరలు ఎలా లభిస్తాయన్న విషయం అలా ఉంచితే అక్కడ భారీగా పంట ఉత్పత్తి జరగడం రానున్న సీజన్ ఆంధ్ర మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

సమసమాజ స్థాపనే మన లక్ష్యం కావాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను కూల్చి మనిషిని మనిషిగా గౌరవించే సమసమాజ స్థాపనే మన లక్ష్యం కావాలని విరసం రాష్ట్ర నాయకుడు జి.కల్యాణరావు పేర్కొన్నారు. ఒంగోలులోని ఐఎంఏ హాలులో మంగళవారం మన్నం ప్రసాద్ సంస్మరణ సభ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర సదస్సుకు ఒర్సు శ్రీను అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కల్యాణరావు మాట్లాడుతూ పరిశ్రమలు, ఫైనాన్స్ కంపెనీలు, వ్యాపారాలు, మైనింగ్, ఐటీ, విద్య, వైద్య తదితర రంగాలు జాతీయం చేయాలనే అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కి నయాబానిస వ్యవస్థను నిర్మించే పనిలో ఉన్నాయని ఆరోపించారు. హైకోర్టు న్యాయవాది జైభీమారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలో ప్రతి పౌరుడికి ప్రసాదించిన ప్రాథమికహక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కొత్తనేర చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుడ్డు వెంకట్రావు, డి.చంద్రశేఖర్, కావలి బాలయ్య, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో అవస్థలు

- ప్రమాదకరంగా ప్రధాన రహదారులు, వంతెన
- మరమ్మతులు చేపట్టకపోతే నష్టమే



శిథిలావస్థలో చీరాల - బాపట్ల రోడ్డులోని వంతెన



ఈపూరుపాలెం ప్రధాన రహదారిపై నిలిచిన వాన నీరు

చీరాలటౌన్, సెప్టెంబరు 10 : కొద్ది రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలతో చీరాల పట్టణం, గ్రామీణంలోని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారులపై నీళ్లు చేరి వాగును తలపిస్తున్నాయి. అంతేకాకుండా ఆ రోడ్లు కోతకు గురై ఉండటంతో వాహనదారులు పట్టుతప్పుతున్నారు. చాలా ఏళ్ల తరువాత ఈపూరుపాలెం ఆటోనగర్ నుంచి స్ట్రయిట్ కట్ కాలువ వరకు అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. రోడ్డుకు ఒకవైపులా పనులు పూర్తి చేశారు. రెండోవైపు మొదలు పెట్టేలోపే వర్షాలు రావడంతో పనులు నిలిచాయి. ఈక్రమంలో ప్రజలకు ప్రయాణం నరకంగా మారింది. వైసీపీ హయాంలో మరమ్మతులు సక్రమంగా జరగలేదు. తిరిగి పది రోజుల కిందట పనులు ప్రారంభించారు. వాతావరణం ప్రతికూలత వలన పనులు అర్ధాంతరంగా ఆగాయి. దీంతో నిత్యం చీరాల నుంచి బాపట్ల, గుంటూరు, విజయవాడకు వెళ్లే బస్సులు, హెవీ వెహికల్స్ వారు తంటాలు పడుతున్నారు.

ఈ మార్గంలోనే ఈపూరుపాలెం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. అంతేకాకుండా వంతెనపై గుంతలు చెలరేగుతున్నాయి. దాదాపుగా మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సైడ్ దిమ్మెలు పూర్తిగా ఇరిగిపోయాయి. దీనికితోడు నానుడి వాన జతకట్టడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ప్రజలు, విశ్లేషకులు అంటున్నారు.

అధ్వానంగా రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం



అడుగుకో గొయ్యి పడిన బల్లికురవ-మార్టూరు రోడ్డు

అద్దంకి, సెప్టెంబరు 10 : అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అవి అధ్వానంగా మారాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రోడ్లు సైతం గోతులమయంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే అద్దంకి - దర్శి రోడ్డులో అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో గత రెండు నెలలుగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పెద్దవిగా మారడంతో వాహనచోదకులు రాకపోకలు చేయలేకపోతున్నారు. గుండ్లకమ్మ నదిపై ఉన్న బ్రిడ్జిపై కూడా గోతులు ఏర్పడ్డాయి. అసలే కూలే స్థితిలో ఉన్న బ్రిడ్జిపై ఈ గోతులు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అద్దంకి, బల్లికురవ మండలాలలోని పలు గ్రామాలను కలుపుతూ ఉన్న శాంతినగర్ - మైలవరం - వీ కొప్పెరపాడు రోడ్డుకు సుమారు రెండు దశాబ్దాలుగా కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. బల్లికురవ-మార్టూరు రోడ్డులో అడుగుకో గొయ్యిగా మారింది. పలు చోట్ల అసలు తారు రోడ్డు ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఇక పలు చోట్ల ఉన్న బ్రిడ్జిల పరిస్థితి కూడా ప్రయాణికులను మరింత ఆందోళన కలగిస్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



భవానీ సెంటర్ రోడ్డులో పెద్ద గోతులు



గుండ్లకమ్మ బ్రిడ్జిపై ఉన్న గోతులు



అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్

జాబ్ మేళాలో 12 మందికి ఉద్యోగాలు

పర్చూరు, సెప్టెంబరు 10: పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలకు 82 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. వారిలో 12 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషకుమారి తెలిపారు. జాబ్ మేళాలో ఐదు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయోద్యమ నాయకుల స్ఫూర్తితో ఎదగాలి

వాడరేవు(చీరాలటౌన్), సెప్టెంబరు 10 : ప్రజాస్వామ్యంలో యువత జాతీయోద్యమ నాయకుల స్ఫూర్తితో ఎదగాలని తద్వారా సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని సీఐటీయూ నాయకులు ఎన్.బాబూరావు అన్నారు. చీరాల మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో డీవైఎఫ్ఐ, విశ్వమానవ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేద విద్యార్థుల ఉచిత ట్యూషన్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. యువత ఉచిత ట్యూషన్ సెంటర్ నడిపేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు గంగిరి ఏసుబాబు, టీచర్ మౌనిక విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 10 : విశాఖ ఉక్కు ప్రవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి కేఎల్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిక్షా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చిలకా ఏసు, కార్యదర్శి ఆరిగెల గురవయ్య, ఆకుల పిచ్చయ్య వెంకట్రావు, ఎస్‌కె మస్తాన్, నల్లయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి సాయం

మార్టూరు, సెప్టెంబరు 10 : అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దివ్యాంగురాలు గడ్డం రత్నకుమారికి మంగళవారం హెల్పింగ్‌హ్యాండ్స్ వారు సాయం అందించారు. 25 కిలోల బియ్యం, రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు పఠాన్ కాదర్‌వలి, పుట్టా అయ్యప్పస్వామి, పోతురాజు, హరిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

108 ఈఎంటీ మృతి



మార్టూరు, సెప్టెంబరు 10 : 108 వాహనంలో ఈఎంటీగా పనిచేస్తున్న ఉద్యోగి నాగండ్ల నాగేశ్వరమ్మ (42) మంగళవారం మృతి చెందారు. మార్టూరు లోని నేతాజీ నగర్‌కు చెందిన నాగేశ్వరమ్మ 15 ఏళ్ల నుంచి 108లో పని చేస్తున్నారు. అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మార్టూరు పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే క్రమంలో 108 వాహనంలో క్షతగాత్రులకు అవసరమైన సేవలందించి బాధితుల నుంచి ప్రశంసలందుకున్నారు. మార్టూరు రోటరీ క్లబ్ రెండు సార్లు ఆమెను సత్కరించింది. నాగేశ్వరమ్మ మృతిపట్ల సహచర సిబ్బంది సంతాపం తెలిపారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి హరిబాబు మట్టిఖర్చులకు రూ.15వేలను అందచేశారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నేరాలకు పాల్పడితే చర్యలు

చీరాలటౌన్, సెప్టెంబరు 10 : పట్టణంలో అశాంతి వాతావరణం నెలకొల్పి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ ఎస్ఐ అజిత అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి పట్టణంలోని పలు లాడ్జీలను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అద్దెలకు వచ్చిన వారి నుంచి తప్పనిసరిగా వివరాలను తీసుకోవాలన్నారు. అనుమానితుల వివరాలు స్టేషన్‌కు అందించి నేరనియంత్రణకు సహకరించాలన్నారు. అనంతరం గదులను ఆమె తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

రూ.57వేల సాయం

అద్దంకిటౌన్ : రోటరీ డిస్ట్రిక్ 3150 ఆపద్బంధు పథకం ద్వారా వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ కోసం మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రూ.57వేల చెక్కును అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీకి క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి మురళిసుధాకరరావు, కోశాధికారి మలాది శ్రీనివాసరావు, దివాకర్‌దత్తు, దేవపాలన, లేవి ప్రసాద్, శ్రీనివాసరావు, మురళికృష్ణ, పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కనకయ్య సేవలు చిరస్మరణీయం

పర్చూరు, సెప్టెంబరు 10 : క్రిష్ణంశెట్టి కనకయ్య సేవలు చిరస్మరణీయమని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరు మురళీకృష్ణ అన్నారు. కామ్రేడ్ కనకయ్య 9వ వర్ధంతి సందర్భంగా పర్చూరులోని బాలికల పాఠశాలలో మంగళవారం సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన కనకయ్య స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాన కూడలి ప్రాంగణంలో కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సంస్మరణ సభ నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ బాలికలు విద్యావంతులైతే సమాజం అభివృద్ధి చెందుతున్న సంకల్పంతో ప్రాంతీయ విద్యాభివృద్ధి సంస్థ ద్వారా బాలికల పాఠశాలలను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యను అందించిన ఘనత ఆయకే దక్కుతుందన్నారు. ఆయన మరణాంతరం కుటుంబ సభ్యులు అదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, కృష్ణంశెట్టి అజయ్‌బాబు, పార్వతి, కోటి క్రాంతి శ్రీనివాసరావు, ఆరాధ్యుల భగవత్‌వంశీ, కోటి విక్రమ్ కుమార్ ఆజాద్, శాంతి, వెంకటేశ్వర్లు, కారుమూరి శీతారామయ్య, క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, కోటా శ్రీనివాసరావు, కాసా అశోక్ కుమార్, కారుమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కనకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ తదితరులు



మాట్లాడుతున్న చీరాల ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

బాధ్యతాయుతంగా బోధన చేయాలి

చినగంజాం, సెప్టెంబరు 10 : ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా బోధన చేయాలని చీరాల డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి అబ్బరాజు శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, పాఠశాలలోని ఇంటర్‌ను తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని డి.రత్నకుమారి అధ్యక్షతన ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్జెక్టులపై పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఖాళీగా ఉన్నటువంటి తెలుగు, సోషల్ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేస్తామని తెలిపారు. ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్‌లో బోధించుటకు అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని ఆర్జేడీ, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి వారు ఇక్కడ పని చేసే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. మన బడి - మన భవిష్యత్ ద్వారా వచ్చిన నిధులతో తరగతి గదుల మరమ్మతులకు కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలోని సైన్సు ల్యాబ్, డిజిటల్, వర్చువల్ తరగతి గదులను ఆయన పరిశీలించారు. పాఠశాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం హెచ్ఎం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావును సన్మానించారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పంగులూరు, సెప్టెంబరు 10 : పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో రామాంజనేయులు కోరారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, పాఠశాలల హెచ్ఎంలు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సమావేశం మంగళవారం జరిగింది. ఎంఈవో వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వారంలో రెండుసార్లు టాయిలెట్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలు అప్‌డేట్ చేయాలని ఆయన సూచించారు. ఎకడమిక్ క్యాలెండర్ క్రమం తప్పకుండా అమలు చేయాలని, పాఠ్యప్రణాళిక రూపకల్పన విషయంలో హెచ్ఎంలు తగిన చర్యలు చేపట్టాలని ఎంఈవో వీరాంజనేయులు కోరారు. సమావేశంలో ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు బంగారుకొండ, రమాదేవి, గిరిజ పాల్గొన్నారు.

అన్నదాతల అభ్యర్థన

- స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి
- ఆర్‌బీ చానల్ కాలువలో పూడిక తొలగింపు



గుర్రపుడెక్కతో నిండిపోయిన ఆర్‌బీ చానల్, బాగు చేసిన తరువాత నీటితో ఇలా

చినగంజాం, సెప్టెంబరు 10 : కడవకుదురు, సంతరావూరు ప్రాంత రైతుల అభ్యర్థనకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంటనే స్పదించారు. చినగంజాం మండల పరిధిలోని రాజుబంగారుకాలువ(ఆర్‌బీ చానల్) మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వరి భూములకు సైతం నీరందేలా చర్యలు చేపట్టారు. సంతరావూరు లాకుల వద్ద నుంచి కడవకుదురుప్రాంత శివారు వరకు ఉన్న రాజుబంగారుపాలెం కాలువలో ఇసుక మేటలు, గుర్రపుడెక్క, తూటికాడ, చిల్లచెట్లతో నిండిపోయిన విషయాన్ని ఎమ్మెల్యేఏలూరి దృష్టికి రైతులు తీసుకొని వెళ్లారు. చివరి భూములకు నీరు రాకపోవడంతో గత ఐదేళ్లుగా పంట భూములన్ని బీడుగా మారాయని, వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని కాలువ పూడిక తీయించాలని సంతరావూరు, కడవకుదురు ప్రాంతాల రైతులు కోరారు. దీనికి స్పదించిన ఎమ్మెల్యే ఏలూరి జలవనరుల శాఖాధికారులతో మాట్లాడి కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ నిధులు ఐదు లక్షల రూపాయిలతో ఆర్‌బీ చానల్‌లో సుమారు ఏడు కిలోమీటర్ల మేర పేరుకుపోయిన ఇసుక మేటలు, గుర్రపు డెక్క, చిల్లచెట్లను తొలగించి, చివరి భూములకు సైతం నీరు పారేలా ఆగమేఘాలపై పనులు చేయించారు. దీంతో చివరి భూములకు సైతం అందేలా కాలువలో నీరు కళకళలాడింది. రైతులు సమస్యను ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకొని వచ్చిన వెంటనే ఆయన స్పందించి పనులకు ఆదేశించారు. వారం రోజుల్లోనే ఏడు కిలోమీటర్ల మేర ఉన్న ఆర్‌బీ చానల్‌ను బాగు చేయించి రైతులకు అందుబాటులోనికి తీసుకొచ్చారు. రైతు సమస్యలు తెలిసిన రైతు బాంధవుడుగా ఎమ్మెల్యే ఏలూరి సమస్యను తక్షణమే పరిష్కరించారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కృషితో వెయ్యి ఎకరాల భూమి సాగులోనికి వస్తుందని కడవకుదురు ప్రాంత అన్నదాతలు తెలిపారు.

నిమజ్జనోత్సవం



సాగర్ కాలువకు నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

మార్టూరు, సెప్టెంబరు 10 : మండలంలో వినాయకుని నిమజ్జన కార్యక్రమాలును మంగళవారం భక్తులు ఉత్సాహంగా నిర్వహించారు.మరికొన్ని చోట్ల మండపాల్లో కొలువైన గణపతులు పూజలందుకుంటున్నారు. బాలాజీ అపార్ట్‌మెంట్ రోడ్డులో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహ నిమజ్జనకార్యక్రమం కోలాహలంగా సాగింది. ఊరేగింపులో లక్ష్మీనారాయణ, వేణు, జయబాబు, గ్రానైట్ శ్రీను పాల్గొన్నారు. గుంటూరు వారి అపార్ట్‌మెంట్ నుంచి ఉపసర్పంచ్ చెరుకూరి వేణు పర్యవేక్షణలో వినాయకుడు ప్రధాన సెంటరులో ఊరేగింపుచేశారు. నాగరాజుపల్లి రోడ్‌లో సాయి మల్లికార్జున అపార్ట్‌మెంట్ వాసులు ఊరేగింపుగా నిమజ్జనం చేశారు. వారందరూ బొల్లాపల్లి సాగర్ కాలువ వరకు విగ్రహాలను తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కాకతీయనగర్‌లో వినాయకుని మండపం వద్ద మహిళలు కుంకుమపూజ చేశారు. అనంతరం స్వామి వారి లడ్డూను యు, రమాదేవి రూ.10500 వేలంపాటలో దక్కించుకున్నారు. రాజుగారిపాలెంలో మండపం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మేదరమెట్లలో నిమజ్జనానికి తరలుతున్న లంబోదరుడు

పంగులూరు : వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నాలుగో రోజు గణనాధునికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెంలో శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన గణనాధుని బెలూన్లతో ప్రత్యేకంగా అలంకరించారు. మండపాల వద్ద దంపతులు ప్రతి రోజూ పూజలు నిర్వహిస్తూ ప్రసాదాలను పంచిపెడుతున్నారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. పంగులూరులోని అప్పలనేని కళావేదిక వద్ద మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



పంగులూరులో మహిళల కోలాటం

మేదరమెట్ల : పలు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించారు. మంగళవారం పలు విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. గులాములు చల్లుకుంటూ, బాణ సంచా కాలుస్తు జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ, నృత్యాలు చేశారు. ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు నిమజ్జనానికి తరలించారు.

సమారాధనను జయప్రదం చేయండి

చీరాలటౌన్, సెప్టెంబరు 10 : వీర రాఘవపేటలో జైగణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో నేడు మహా సమారాధనను ఘనంగా నిర్వహిస్తున్నారు. 31వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం సమారాధన, రాత్రి 7 గంటలకు నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. విశేషంగా భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గుండ్లకమ్మలో నిమజ్జనాలకు ఏర్పాట్లు



నిమజ్జనాలకు వీలుగా తిమ్మాయపాలెం వద్ద చిల్లచెట్ల తొలగింపును పరిశీలిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి, సెప్టెంబరు 10 : వినాయక విగ్రహాలను గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేసేందుకు వీలుగా పోలీస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలోని తిమ్మాయపాలెం వద్ద గుండ్లకమ్మ నదిలో గణపతి విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు వీలుగా ఎక్స్‌కవేటర్‌తో దారికి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగింపచేశారు. నిమజ్జనం చేసే ప్రాంతంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయించారు. ఏర్పాట్లను సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా తదితరులు పర్యవేక్షించారు. అనుమతులు తీసుకున్న విధంగా విగ్రహాల నిమజ్జనాలు, ఊరేగింపులు చేసుకోవాలని సీఐ కృష్ణయ్య సూచించారు. గుండ్లకమ్మ నదితో పాటు భవనాసి చెరువులో నిమజ్జనాలు జరగనున్నాయి. ఈ ఏడాది అన్ని చెరువులు, వాగులు, ఎస్ఎస్‌పీ కాలువలలో నీరు పుష్కలంగా ఉండడంతో ఎక్కడికక్కడే నిమజ్జనాలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. బుధవారం పెద్ద సంఖ్యలో నిమజ్జనాలు జరగనున్నాయి.